ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 14 జూన్ 2024

ప్రజాధనం వృథా కాకూడదని..

- జగన్ బొమ్మతోనే స్టూడెంట్ కిట్స్
- సీఎం చంద్రబాబు నిర్ణయం
- 8, 9, 10 విద్యార్థులకు ఇంకా రాని కిట్స్
- గత ప్రభుత్వ నిర్వాకంతో ఆలస్యం





స్టూడెంట్ కిట్లతో అధికారులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వమైనా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రజాధనం దుర్వినియోగం.. వృథా కాకుండా చూడాలి. ఐదేళ్లుగా రాష్ట్రంలో జరిగిన అరాచక పాలనతో ప్రజాధనం ఎంత దుర్వినియోగం, వృథా అయిందో రాష్ట్ర ప్రజలు కళ్లారా చూశారు. ప్రజాధనం వృథా కాకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే చంద్ర బాబునాయుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఐదు సంవత్సరాలుగా జగన్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పేరుతో అందిస్తున్న కిట్లపైన జగన్ బొమ్మను ముద్రించింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బ్రహ్మాండమైన మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. దీంతో విద్యాకానుక కిట్ల పంపిణీపై సందిగ్ధత నెలకొంది. దానికి తెరదించుతూ జగన్ బొమ్మతో ఉన్న కిట్లనే విద్యార్థులకు పంపిణీ చేయమని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. గత ప్రభుత్వ నిర్వాకంతో ఇంకా 8, 9, 10 విద్యార్థులకు అవసరమైన కిట్లు సరఫరా కాలేదు. అధికారులు జగనన్న విద్యాకానుక పేరుకు బదులుగా స్టూడెంట్స్ కిట్స్ అని పేరు పెట్టారు. 7వ తరగతి వరకు సైతం విద్యార్థులకు కావాల్సినంత కిట్లు సరఫరా కాకపోవడంతో బడులు తెరిచిన మొదటిరోజు విద్యార్థులకు విద్యాకానుక అందలేదు. దీనిపైన విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు.

2200 పాఠశాలలు..

1,42,008 మంది విద్యార్థులు

జిల్లాలో 2200 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో లక్షా 42 వేల 8 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా పాఠశాలలు ప్రారంభం రోజు విద్యార్థులకు కిట్లను సరఫరా చేసేది. ఈ కిట్లలో ఒక స్కూల్ బ్యాగు. మూడు జతల యూనిఫాం, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక బెల్ట్, నోటు పుస్తకాలు. డిక్షనరీ లేదా గ్రాఫ్‌బుక్ వంటివి ఉంటాయి. ఇప్పటి వరకు జిల్లాలో 7వ తరగతి వరకు అవసరమైన కిట్లు వచ్చినట్లు తెలిసింది. అయితే అందులో కూడా అన్ని వస్తువులు రాలేదని, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు వచ్చినట్లు తెలిసింది. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఇంకా కిట్లు రాలేదని, ఒకటి రెండు రోజుల్లో వస్తాయని పలువురు ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. సాధారణంగా బడులు తెరిచిన మొదటిరోజే విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయాలి. అయితే కొన్నిచోట్ల మాత్రం కిట్లు రావడంతో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు కేవలం పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బెల్టులు మాత్రమే వచ్చాయి. మిగిలిన వస్తువులు రెండు, మూడు రోజుల్లో వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

పీలేరు మండలంలో 1 నుంచి 7వ తరగతి వరకు మండలంలోని అందరు విద్యార్థులకు సరిపడా కిట్లు సరఫరా అయ్యాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మరో రెండు రోజుల్లో రానున్నట్లు పీలేరు ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతమ్మ తెలిపారు. మండలంలో 7వ తరగతి వరకు 3472 మంది విద్యార్థులు ఉన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు 2732 మంది ఉన్నారు. వచ్చిన వస్తువులను మండల విద్యాశాఖాధికారులు గురువారం ఉదయం నుంచే అన్ని పాఠశాలలకు అందిస్తున్నారు. పెనగలూరు మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాలలో 450 మంది విద్యార్థులకు తొలిరోజు కేవలం 50మందే హాజరయ్యారు. వారికి స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయలేదు. మండల కేంద్రానికి వచ్చాయి కానీ ఇంకా పాఠశాలలకు అందలేదు. మదనపల్లె ప్రాంతంలో కూడా తొలిరోజు కిట్లు పంపిణీ రాలేదు.

గత ఏడాదీ ఇదే తంతు

గత ఏడాది కూడా జగన్ ప్రభుత్వం కూడా సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లను అందించలేదు. కిట్లలో నోటుపుస్తకాలు, బూట్లు లేకుండానే విద్యార్థులకు అందించారు. అరకొరగానే పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు నుంచే విద్యాసంవత్సరం మొదటి రోజు విద్యార్థులకు విద్యాకానుక వస్తువులు ఇవ్వాలనే ఆలోచన జగన్ ప్రభుత్వానికి లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఈసారి పాఠశాలలు ప్రారంభం అయినా అన్ని తరగతులకూ అవసరమైన వస్తువులు అందడం లేదని పేర్కొంటున్నారు.

ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా..

జగన్ ప్రభుత్వంలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని సైతం ప్రచారానికి వాడుకున్నారు. ఈ కిట్లను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యేలు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఈ పంపిణీ జరిగేది. దాదాపు ప్రతి మండలంలో ఒక కార్యక్రమం ఏర్పాటు చేయడం.. అక్కడ ఈ కిట్ల పంపిణీ జరిగేది. దీంతో సుమారు పది, పదిహేను రోజుల పాటు ఈ పంపిణీ కార్యక్రమం జరిగి విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేది. అయితే ఈసారి చంద్రబాబు ప్రభుత్వం అటువంటి హంగామా ఏమీ లేకుండానే విద్యార్థులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటోంది.

పెళ్లి చేసుకోమన్నాడని..

- తండ్రిని హత్య చేసిన కూతురు
- ఇద్దరి మధ్య వివాదమే కారణం
- హతుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మదనపల్లె అర్బన్, జూన్ 13: తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోమని చెప్పాడని కన్న తండ్రినే ఓ కూతురు దారుణంగా హత్య చేసిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లెలోని పీఅండ్‌టీ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..సదుం మండలం చెరుకువారిపల్లెకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇ.దొరస్వామి (62) కుటుంబసభ్యులతో కలిసి మదనపల్లెలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో దొరస్వామి స్థానిక పీఅండ్‌టీ కాలనీలో సొంతంగా ఇల్లు నిర్మించుకుని దిగువ కురవంకలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. జూలైలో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. ఆయన భార్య లత ఏడాదిన్నర ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో తన కుమార్తె హరిత (24) చేతిలో హత్యకు గురి కావడం చర్చనీయాంశమైంది. బీఎస్సీ, బీఎడ్ చదివిన కుమార్తెతో కలసి దొరస్వామి నివాసం ఉంటున్నారు. పెళ్లి విషయమై తండ్రి, కూతురుకి కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే తన కుమార్తెకు పెళ్లి చేయడానికి సంబంధాలు చూశారని, అయితే అబ్బాయి ఆమెకు నచ్చలేదని చెప్పి తండ్రితో గొడవపడుతున్నట్లు సమాచారం. అయితే హరిత కొందరితో చనువుగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఒకరికి రూ.10 లక్షలు ఇచ్చినట్లు స్థానికులు పోలీసులకు చెప్పారు. అలాగే తండ్రిపై ఒత్తిడి తెచ్చి వారు నివాసం ఉన్న ఇంటిని కూడా తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఇంతలోనే ఏమైందో తెలీదు కానీ బుధవారం రాత్రి 11.45 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి అరుపులు, కేకలు వినపడటంతో చుట్టుపక్కల వారు ఇంటి వద్దకు చేరుకుని చూడగా అప్పటికే ఉపాధ్యాయుడు రక్తపు మడుగులో ఉన్నట్లు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు మదనపల్లె వన్‌టౌన్ సీఐ వల్లీబసు అక్కడికి చేరుకుని సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడే ఉన్న హరితను విచారించగా మొదట్లో పొంతన లేని సమాధానం చెప్పినా తరువాత నేరాన్ని అంగీకరించింది. అట్ల కాడతో తలపై బలంగా మోది హత్య చేసినట్లు ఒప్పుకుంది. దీంతో నిందితురాలిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఉదయాన్నే హత్య జరిగిన ఇంటిని, పరిసరాలను మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ఈ సంఘటనపై మదనపల్లె రూరల్ సీఐ శేఖర్, వన్‌టౌన్ సీఐ వల్లీబసు, టూటౌన్ సీఐ యువరాజులు హత్య జరిగిన ఇంటి చుట్టుపక్కల వారిని విచారించారు. ప్రియుడి వైపు నుంచి కూడా కేసును దర్యాప్తు చేస్తున్నారు. హత్యా స్థలంలో క్లూస్ టీమ్ వివరాలు సేకరించింది. డాగ్ స్క్వాడ్‌ను కూడా రంగంలోకి దింపి వివరాలు రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. హతుడి బంధువు డాక్టర్ నారాయణయ్య ఫిర్యాదు మేరకు హరితపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు.



హత్యకు గురైన దొరస్వామి (ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు



రాత్రిపూట ట్యాంకర్లకు ఆయిల్ నింపొద్దు

- జాతీయ రహదారిపై హెచ్‌పీసీఎల్ ట్యాంకర్ డ్రైవర్ల ధర్నా

సిద్దవటం, జూన్ 12: రాత్రిపూట ట్యాంకర్లకు ఆయిల్ నింపొద్దని, సమస్యలను పరిష్కరించాలని హెచ్‌పీసీఎల్ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్లు గురువారం సిద్దవటం మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారిలోని హెచ్‌పీసీఎల్ వద్ద ధర్నా చేశారు. ఆయిల్ ట్యాంకర్లను నిలిపివేసి దాదాపు రెండు గంటల పాటు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ షరీఫ్‌హుస్సేన్ మాట్లాడుతూ మా సమస్యలు పరిష్కరించకుండా హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ నిర్లక్ష్య ధోరణి చూపుతున్నారని ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్స్ యూనియన్ ప్రెసిడెంట్ షరీఫ్ హుస్సేన్ ఆరోపించారు. సాయంత్రం 4.30 గంటలకు ఎటువంటి ఆయిల్ రవాణా జరగకుండా డిపో క్లోజ్ చేయమంటే వారు ఏమాత్రం స్పందించడం లేదన్నారు. డ్రైవర్లకు చాలావిధంగా నచ్చచెప్పినప్పటికీ వారు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని డీఎం మా సమస్యల పట్ల నిర్లక్ష్యం వీడి సమస్య పరిష్కారం కొరకు కృషి చేయాలని లేకుంటే ఆందోళన చేస్తామన్నారు. సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు ట్యాంకర్లకు ఆయిల్ నింపి పంపిస్తే మేము సరైన సమయానికి ఆయిల్‌ను సంబంధిత బంకులకు అందిస్తామని, అలా కాకుండా రాత్రిపూట ఆయిల్ నింపడం వల్ల ట్యాంకర్ గమ్యస్థానానికి చేరుకోలేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. రాత్రి 10 గంటలు దాటితే బంకుల యజమానులు సమయం అయిపోయిందని ఉదయం పూట ఆయిల్ నింపుకుంటామని చెబుతున్నారని, అలా చేయడం వల్ల ఒకరోజు బంకులోనే స్టే చేయాల్సిన పరిస్థితి ఉందని, దీంతో డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై స్పందించిన హెచ్‌పీసీఎల్ డీఎం సతీష్‌కుమార్ నిరసన చేస్తున్న కార్మికుల వద్దకు వచ్చి వారితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

మోకాళ్లపై మల్లయ్యకొండకు

- చంద్రబాబు సీఎం కాగానే మొక్కు చెల్లింపు
- 6 కి.మీ. మోకాళ్లపై నడిచిన టీడీపీ అభిమాని బయ్యప్ప

తంబళ్లపల్లె, జూన్ 13: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయడంతో మోకాళ్లపై నడుచుకుంటూ మల్లయ్యకొండ ఎక్కి మొక్కులు తీర్చుకున్నాడు టీడీపీ అభిమాని. తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ పెండేరివారిపల్లెకు చెందిన పెండేరి బయ్యప్ప వ్యవసాయంతో పాటు తంబళ్లపల్లె మల్లయ్యకొండపైన ఉన్న వీరన్నగెవిలో పూజలు చేస్తుంటాడు. ఈయన టీడీపీకి వీరాభిమాని. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే మోకాళ్ల మీద మల్లయ్యకొండ ఎక్కుతానని స్వామికి మొక్కుకున్నాడు. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. దీంతో తన కోరిక నెరవేరడంతో బయ్యప్ప గురువారం తెల్లవారుజామున 5 గంటలకు మల్లయ్యకొండ కింద ఉన్న నేల మల్లయ్య స్వామికి పూజలు చేసి మోకాళ్లపై నడుచుకుంటూ కొండ ఎక్కడం ప్రారంభించారు. మల్లయ్యకొండ కింద నుంచి పైకి సుమారు 6 కి.మీ ఉంటుంది. మధ్యాహ్నం 3:30 గంటలకు కొండపైన ఆలయం వద్దకు చేరుకున్నాడు. ఆలయంలో భ్రమరాంభిక సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నాడు.



మోకాళ్లపై నడుచుకుంటూ మల్లయ్యకొండ ఎక్కుతున్న టీడీపీ అభిమాని బయ్యప్ప



ఆశలన్నీ నైరుతిపైనే..


- అడుగంటిన పెద్దేరు..
- ఒట్టిపోయిన బాహుదా ప్రాజెక్టు
- రెండూ ఒకే పంటకే పరిమితం
- పర్క్యులేషన్‌గా మినీ జలాశయాలు

మదనపల్లె, జూన్ 13: జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని రిజర్వాయర్లు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో మూడు రోజులు ముందుగానే పలకరించిన నైరుతిపైనే రైతుల ఆశలన్నీ ఉన్నాయి. నిమ్మనపల్లె మండలంలోని బాహుదా, తంబళ్లపల్లె మండలంలోని పెద్దేరు ప్రాజెక్టులు గత ఏడాది అక్టోబరు, నవంబరులో కురిసిన వర్షాలకు నిండి మొరవపోయాయి. తర్వాత రబీ సీజన్‌లో పంటలు సాగు చేయడంతో ఉన్న నీరంతా ఖాళీ అయింది. అప్పటికే బాహుదా కింద సాగులో ఉన్న పంటలు కూడా అతికష్టం మీద బయటపడగా, పెద్దగా సాగు లేని పెద్దేరు కింద ఉన్న పంట పూర్తి కాగా, మిగిలిన నీరు రెండో పంటకు చాలవనే సంకేతాలతో రైతులకు సాగుకు స్వస్తి చెప్పారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం బాహుదా ప్రాజెక్టు పూర్తిగా అడుగంటిపోగా పెద్దేరు పాతిక భాగానికి చేరుకుంది. ఇక ఖరీఫ్ సాగు కావాలంటే రైతులంతా వరుణదేవుడిపైనే ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. ఇటీవల అడపాదడపా వర్షానికి తాగునీటి సమస్య నుంచి ప్రజలు గట్టెక్కగా, సాగునీటికి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అడుగంటిన ప్రాజెక్టులు, ఎండిన చెరువులు, కుంటలు ఇప్పటికీ నెర్రెలు బారి నోళ్లు తెరవగా, ఆయకట్టు భూములు మాత్రం బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.


తంబళ్లపల్లె మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు కరువునకు నిలయమైన తంబళ్లపల్లె నియోజకవర్గానికి కల్పతరువు లాంటిది. ఒకప్పుడు రెండుపంటలు సాగయ్యే ఈ ప్రాజెక్టు క్రమంగా ఒక పంటకే పరిమితం అవుతోంది. తంబళ్లపల్లె మండలంలోని కొటాల, గోపిదిన్నె, పెద్దమండ్యం మండలంలోని బండ్రేవు వరకూ రైతులు పంటలు సాగు చేస్తుంటారు. 560 ఎంసీఎఫ్‌టీ నీటి సామర్థ్యం గల పెద్దేరు కింద కుడి, ఎడమ కాలువల కింద 4,300 ఎకరాల వరకూ పంటలు సాగవుతున్నాయి. పంటలు సాగవడం ఒక ఎత్తయితే, అటు ప్రాజెక్టు, ఇటు కాలువల్లో నీరు ప్రవహించినన్నాళ్లూ దిగువ ప్రాంతంలోని రైతుల వ్యవసాయ బావులు, బోర్లు సమృద్ధిగా ఉంటాయి. అలాగే గ్రామాల్లోని తాగునీటి పథకాలు కూడా పుష్కలంగా ఉంటూ ఎక్కడా తాగునీటి సమస్యే ఉండదనే చెప్పాలి. అయితే 2020 ఏడాది నుంచి 2023 వరకూ ఏటా ప్రాజెక్టు నిండి మొరవపోతోంది. ఇందులో భాగంగా గతేడాది అక్టోబరు, నవంబరులో ఎగువ ప్రాంతంలోని కర్ణాటక సరిహద్దులో కురిసిన వర్షాలతో ప్రాజెక్టు నిండి అదే సీజన్‌లో మూడుసార్లు నిండి మొరవపోయింది. తర్వాత రబీ సీజన్‌లో పంటలు సాగు కావడంతో నీరు అడుగంటిది. పూర్తి స్థాయిలో ఆయకట్టు విస్తీర్ణం సాగులోకి రాకపోవడంతో నీరింకా మిగిలిందని, లేకుంటే అడుగంటేదని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న 200 ఎంసీఎఫ్‌టీ నీరు.. రెండో పంటకు ఎక్కడా చాలకపోవడంతో వదిలేసినట్లు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ పంట సాగు కావాలంటే ప్రాజెక్టు మరోసారి నిండాల్సిందేనని రైతులు తెగేసి చెబుతున్నారు.

నిమ్మనపల్లె మండలంలోని బాహుదా ప్రాజెక్టుది కూడా ఇదే పరిస్థితి. ఈ ప్రాజెక్టు ఆధారంగా రబీలో సాగైన పంటలు అతికష్టమ్మీద గడ్డన పడ్డాయనే చెప్పాలి. బాహుదా కూడా 2020 నుంచి ఏటా నిండుతూనే ఉంది. ఈ క్రమంలో గతేడాది అక్టోబరు, నవంబరులో కురిసిన వర్షాలకు మొరవపోయింది. 356 ఎంసీఎఫ్‌టీ నీటి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ప్రస్తుతం చుక్కనీరు లేక నోరెళ్లబెడుతోంది. నిమ్మనపల్లె, వాల్మీకిపురం మండలాల పరిధిలో కుడి, ఎడమ కాలువల కింద 2,880 ఎకరాలు ఆయకట్టు ఉండగా, ఏటా ఒక సీజన్ సాగవుతోంది. ఈ ఏడాది మార్చి నాటికే నీరు పూర్తిగా ఇంకిపోగా, ఇటీవల కురిసిన వర్షాలకు ప్రస్తుతం పడికట్టులోకి నీరు చేరింది. ఇప్పటికే రైతుల వ్యవసాయ బోర్లు కూడా రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే, తాగునీటికీ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. బాహుదాతో పాటు తంబళ్లపల్లె పెద్దేరు కూడా కుడి, ఎడమ కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చివరి ఆయకట్టు వరకూ నీరు వెళ్లడం లేదు. సాగునీటి కాలువలు చాలా వరకూ పూడిపోవడం, పిచ్చిమొక్కలు నిండిపోవడంతో లీకేజీలతో నీరు పూర్తి స్థాయిలో ముందుకెళ్లడం లేదని రైతులు చెబుతున్నారు.

తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రూ.20 కోట్ల వ్యయంతో నాలుగు చిన్నతరహా ప్రాజెక్టుల పరిధిలో 5,200 ఎకరాలకు సాగునీరు, రెండు చెరువులను నింపాలన్నది లక్ష్యం. అయితే లక్షలు, కాదు కోట్ల రూపాయలు వెచ్చించినా..ప్రభుత్వం ఆశించినట్లు రైతుల లక్ష్యం నెరవేరలేదు. ప్రాజెక్టులు పూర్తి చేశారు..కానీ కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో పుష్కర కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఇవన్నీ పర్క్యులేషన్ ట్యాంకులుగానే మిగిలిపోయాయి. ఇప్పటికే తీసిన కాలువలు పూడిపోవడం, కలుపు మొక్కలు, కంపచెట్లతో నిండిపోయి అసలు రూపాన్ని కోల్పోయాయి. ఇందులో తంబళ్లపల్లె మండలం దబ్బలగుట్టపల్లె సమీపంలోని దబ్బలగుట్ట మినీ ప్రాజెక్టును రూ.2.75 కోట్ల వ్యయంతో 220 ఎంసీఎఫ్‌టీ నీటి సామర్థ్యంతో 2011లో పూర్తి చేశారు. తంబళ్లపల్లె పంచాయతీ పరిధిలోని 800 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో మూడున్నర కిలోమీటర్లు రెండు కాలువలను తవ్వారు. ఇదే మండలంలో రూ.7.60 కోట్లతో చిన్నేరు మినీ ప్రాజెక్టునూ 2010లో పూర్తి చేశారు. 370 ఎంసీఎఫ్‌టీల సామర్థ్యంతో రెండు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంలో రెండు కిలోమీటర్ల చొప్పున కుడి, ఎడమ కాలువలు తవ్వారు. చిన్నేరు అందుబాటులోకి వస్తే గోపిదిన్నె, గుండ్లపల్లె పంచాయతీలకు సాగునీరు, గోపిదిన్నె చెరువునకు సాగునీరు అందుతుంది. వివిధ కారణాలతో కాలువలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అలాగే పీటీఎం మండలం మడుమూరు పంచాయతీ మిట్టసానిపల్లె వద్ద రూ.6.50 కోట్ల వ్యయంతో పదేళ్ల క్రితం మిట్టసానిపల్లె మినీ ప్రాజెక్టును నిర్మించారు. 400 ఎంసీఎఫ్‌టీల నీటి సామర్థ్యంతో ములకలచెరువు మండలంలోని సుమారు 500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించారు. దీనికి కుడి, ఎడమ కాలువలు కూడా తవ్వారు. మరోవైపు పెద్దమండ్యం మండలం శివపురం సమీపంలో ఆకుమానుగుట్ట మినీ ప్రాజెక్టును నిర్మించారు. 2005లో పనులు ప్రారంభించి, 2009లో పూర్తి చేశారు. 330 ఎంసీఎఫ్‌టీల నీటి సామర్థ్యం కలిగి, 1200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.3.20 కోట్లతో పనులు చేపట్టారు. పెద్దమండ్యం మండలంలోని కోటకాడపల్లె, గుర్రంవాండ్లపల్లె పంచాయతీలకు సాగునీరు ఇవ్వడానికి పది కిలోమీటర్ల మేర రెండు కాలువలు తవ్వారు. పనులు అర్ధంతరంగా ఆగిపోవడం, పరిహారం అందకపోవడం, సాంకేతిక కారణాలతో నీరు ప్రవహించక నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 16 టీఎంసీల నీటిని నిల్వ చేసే మినీ ప్రాజెక్టులు, పెద్ద పెద్ద చెరువులు ఉన్నా.. వర్షపునీటిని వినియోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు. అయితే ఉన్నవాటిని వినియోగంలోకి తేకపోగా, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులను పైపులైన్ ద్వారా అనుసంధానం చేస్తామని ప్రభుత్వం చెప్పడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేస్తే వినియోగంలోకి వచ్చే పనులు వదిలేసి, రూ.కోట్లు కుమ్మరించి ఎప్పుడో నీరు తెస్తామని పాలకులు చెప్పడాన్ని ప్రజలు విశ్వసించడం లేదు.



ఒట్టిపోయిన బాహుదా ప్రాజెక్టు



రాళ్లు తేలిన బాహుదా మొరవ



అడుగంటిన పెద్దేరు ప్రాజెక్టు



పర్క్యులేషన్ ట్యాంకుగా చిన్నేరు ప్రాజెక్టు

అడ్డగోలుగా పనులు... రూ.లక్షల్లో అవినీతి

- పనులు చేయకుండా నిధులు మింగేసిన వైనం
- చేసిన పనులు మళ్లీ చేసి దోపిడీ
- రైల్వేకోడూరు పంచాయతీలో వైసీపీ నేతల దందా

రైల్వేకోడూరు, జూన్ 13: మేజర్ పంచాయతీ అయిన రైల్వేకోడూరులో వైసీపీ నేతలు అడ్డగోలుగా పనులు చేపట్టి లక్షలాది రూపాయల నిధులను మింగేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారం పనులు చేపట్టి పంచాయతీ నిధులు బొంచేశారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పంచాయతీ నిధులతో రోడ్డు మీద రోడ్డు వేసి తిమింగళాల్లా తినేశారని టీడీపీ వార్డు సభ్యులు గగ్గోలు పెట్టినా అప్పట్లో పట్టించుకునే వారే కరువయ్యారు..

రైల్వేకోడూరు మేజర్ పంచాయతీకి 2021లో ఎన్నికలు జరిగాయి. సుమారు మూడున్నర సంవత్సరాల కాలంలో ఎన్నో అవినీతి పనులు చేశారని... అప్పట్లో టీడీపీ వార్డు సభ్యులు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. రైల్వేకోడూరు పట్టణ సుందరీకరణ కోసం ఏపీఎండీసీ రూ.33లక్షల నిధులు కేటాయించి పంచాయతీకి బదలాయించింది. ఈ పనులు తూతూ మంత్రంగా చేసి నిధులు గోల్‌మాల్ చేశారు. రైల్వేకోడూరు ప్రధానదారికి మధ్యలో డివైడర్‌కు గతంలో ఉన్న ఇనుప గ్రిల్స్ నిర్మాణం చేసిన గోడలను తొలగించారు. మళ్లీ డివైడర్‌పై గోడ నిర్మాణం చేశారు. మధ్యలో మొక్కలు నాటడానికి మట్టి పోశారు. నాసిరకం మొక్కలు నాటడడంతో మొక్కలు కూడా చాలా వరకు చనిపోయాయి. ఇక గత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా డివైడర్లను సుందరీకరణ చేశారు. మధ్యలో బట్టర్‌పై లైటింగ్ ఏర్పాటు చేశారు. కొత్తగా సుందరీకరణలో భాగంగా పాత స్తంభాలకే మెరుగులు దిద్ది లైట్లు మాత్రమే ఏర్పాటు చేసి బిల్లులు చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ నిధులతో క్రిష్ణానగర్ ప్రాంతంలో రోడ్డు మీద రోడ్డు వేశారు. ఇక ఇంటి ప్లాన్ అప్రూవల్‌కు సంబంధించి అవినీతి ఆరోపణలు తీవ్రంగా విని పిసున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు ఇంజినీర్లు కూడా ఇంటి ప్లానింగ్ అప్రూవల్‌లో చాలా వరకు నొక్కేశారని బాధితులు ఆరోపించారు. ఇక అధికారం చేతిలో ఉంది కదా అని ఇష్టానుసారం 10కి పైగా కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారని టీడీపీ వార్డు సభ్యులు గతంలో వాదించారు. పని లేకపోయినా కాంట్రాక్టు కింద సిబ్బందిని పెట్టుకున్నారని ఆరోపణలు వచ్చినా వైసీపీ ప్రభుత్వం, నేతలు పట్టించుకో లేదు. కొత్తగా కాంట్రాక్టు పనిలో పెట్టుకున్న వారు పనులు సక్రమంగా చేయరు. ప్రతి రోజు వచ్చి కార్యాలయంలో ప్రజెంట్ వేయించుకుని ప్రతినెల రూ.13,600లు జీతాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీలో జరిగిన అవినీతిపై ఉన్నత స్థాయి కమిటీ వేసి నిగ్గుతేల్చాలని పలువురు కోరుతున్నారు.

రికార్డులు తారుమారు..

పంచాయతీలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలు, నిధుల స్వాహా తదితర వాటి రికార్డులను ఎన్నికలకు ముందుగానే తారుమారు చేశారని తెలిసింది. ఈ విషయం బయటకు రానివ్వకుండా చేస్తున్నారని తెలుస్తోంది. ఇక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైల్వేకోడూరు ఉపసర్పంచ్ తోట శివసాయి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎక్కడ ఉండేది కూడా పంచాయితీ అధికారులకు అందుబాటులోకి రాలేదు. కోడూరు పంచాయతీలో జరుగుతున్న తతంగం గురించి వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ఉప సర్పంచ్‌కి ఫోన్ చేయగా ఎత్తలేదు.

అన్నీ సక్రమంగానే జరిగాయి..

కోడూరు పంచాయితీలో అవినీతి ఏమీ జరగలేదని కార్యదర్శి డీవీ ప్రసాద్‌రావు తెలిపారు. రికార్డులు ఎక్కడ తారుమారు కాలేదన్నారు. రికార్డులు సక్రమంగా ఉన్నాయని, పనులు సక్రమంగానే జరిగాయని వివరించారు.



క్రిష్ణానగర్ ప్రాంతంలో రోడ్డు మీద రోడ్డు వేసిన దృశ్యం, ఏపీయండీసీ నిధులతో నాటిన మొక్క చనిపోయిన దృశ్యం, మిగిలిన మొక్కలు నాటని వైనం, పాత స్తంభానికే రంగులు వేసిన దృశ్యం

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

- స్టాక్ పాయింట్ పరిశీలించిన డీఈవో



స్టూడెంట్స్ కిట్స్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

చిన్నమండెం, జూన్ 13: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్టూడెంట్ కిట్స్‌ను విద్యార్థులకు డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పంపిణీ చేశారు. మిగిలిన పాఠశాలలకు కూడా కిట్స్‌ను త్వరగా అందించాలని మండల విద్యాశాఖాధికారి అంజనేయులునాయుడును ఆదేశించారు. చిన్నమండెం మండల కేంద్రంలోని స్టూడెంట్స్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేసి మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ వివరాలను మండల విద్యాశాఖాధికారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మిగిలిన పాఠశాలలకు కూడా త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి స్టాఫ్ మీటింగ్‌లో పాఠశాల ఉత్తీర్ణత, అడ్మిషన్‌ల వివరాలను అడిగి తెలుసుకుని పాఠశాలలో ప్రవేశాలు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం డీఈవో చేతుల మీదుగా విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శివానాయక్, హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



రమణమ్మ మృతదేహం

కాశినాయన, జూన్ 13: మండలంలోని అమగంపల్లెలో విద్యుదాఘాతంతో రమణమ్మ (46) అనే మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బుర్ర సుబ్బయ్య భార్య రమణమ్మ గురువారం సాయంత్రం చింతచెట్టు ఎక్కి చింతాకు కోస్తుండగా కరెంట్ షాక్‌తగిలి చెట్టు పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి నలుగురు సంతానం కలరు. గతంలో కూడా ఇదే చింత చెట్టువద్ద కరెంట్ షాక్‌తో పశువు కూడా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలి పారు. విషయం ట్రాన్స్‌కో అధికారులకు తెలియపరిచినా పట్టించకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆమేరకు విషయాన్ని పోలీసులకు తెలియపరిచామన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ- ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన వారు

చిన్నమండెం, జూన్ 13: మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ కేశాపురం రైతు భరోసా కేంద్రం వద్ద కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం నడిమికండ్రిక గ్రామం చింతమేకలపల్లెకు చెందిన ఒక మహిళ తన కుమారుడు, కుమార్తెతో కలసి ద్విచక్రవాహనంలో చిన్నమండెం నుంచి స్వగ్రామం వెలుతోంది. అదే సమయంలో మదనపల్లె వైపు నుంచి చిన్నమండెం వైపు వెళుతున్న కారు కేశాపురం రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కాళ్లు విరిగి ఎముకలు బయటికి రావడంతో క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ల సూచన మేరకు వారిని వెంటనే తిరుపతికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఎస్ఐ రమేశ్‌బాబును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన స్థల వివాదం

- వైసీపీ నేతలు స్థల ఆక్రమణపై బాధితుడితో కలసి టీడీపీ నేతల ఫిర్యాదు



కడప (క్రైం), జూన్ 13: కడప నగరం మద్రాసు రోడ్డులోని రాజేశ్వరి కళ్యాణ మండపం పక్కన ఉన్న రోడ్డు స్థల వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది వైసీపీ నేతలు తన స్థలాన్ని కబ్జా చేసి కంచె ఏర్పాటు చేశారని గురువారం స్థల యజమాని నాగేశ్వర్‌రావుతో పాటు టీడీపీ నేతలు రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి వివరాల మేరకు.. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు వైసీపీకి నాయకులు తమ స్థలాన్ని ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేశారన్నారు. తాను కోర్టు నుంచి ఆ స్థలానికి సంబంధించి స్టే ఆర్డరు తెచ్చుకున్నప్పటికీ.. అప్పట్లో వైసీపీ నేతలు తనను స్థలంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకున్నారన్నారు. గురువారం స్థలానికి సంబంధించి కంచెను తొలగించి డాక్యుమెంట్లతో బాధితుడు నాగేశ్వర్‌రావుతో పాటు టీడీపీ నేతలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రిమ్స్ సీఐ రామచంద్ర ఇరువర్గాలను పిలిపించి వారి డాక్యుమెంట్లు తెప్పించుకున్నారు. ఈ విషయమై రిమ్స్ సీఐని వివరణ కోరగా.. ఇరువర్గాలను పిలిపించి డాక్యుమెంట్లు పరిశీలించడంతో పాటు కడప తహసీల్దారుకు పరిశీలనకు పంపించామని తెలిపారు.

యువతిపై హత్యాయత్నం.. ఆపై యువకుడి మృతి

- విచారిస్తున్న పోలీసులు



మృతి చెందిన సాయికుమార్‌రెడ్డి



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బద్వేలుటౌన్/ అట్లూరు, జూన్ 13: ఓ యువతితో నాలుగు సంవత్సరాలు ప్రేమవ్యవహారం నడిపిన యువకుడు అనుమానాస్పస్థితిలో మృతి చెందిన సంఘటన బద్వేలు పట్టణంలో చోటుచేసుకుంది. గురువారం ఉదయం అట్లూరు మండలంలోని లింగాలకుంట్లలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో యువతి విధులు నిర్వహిస్తుండగా.. ఆమెపై సాయి కుమార్‌రెడి (27) అనే యువకుడు పెట్రోలు పోసి, తనపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకునేందుకు యత్నించాడు. గమనించిన రైతు భరోసా కేంద్రంలోని సహోద్యోగులు అడ్డుకోవడంతో యువకుడు వెను తిరిగాడు. అక్కడి నుంచి బద్వేలు పట్టణంలోని సిద్ధవటం రోడ్డులో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లి అగ్నికి ఆహుతై మృతి చెందాడు. కాగా, యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా... లేదా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మృతి చెంది ఉంటాడా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే..

మండల కేంద్రమైన కలసపాడు గ్రామానికి చెందిన పామూరి బాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలరు. అందులో చిన్నవాడైన సాయికుమార్‌రెడ్డి పోరుమామిళ్ల, గోపవరం మండలంలో 108 అంబులెన్స్ వాహనానికి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బద్వేలు పట్టణం సిద్ధవటం రోడ్డులోని తన అక్క సరస్వతి ఇంట్లో ఉండేవాడు. కాగా సాయికుమార్‌రెడ్డికి అదే మండలానికి చెందిన ఓ యువతితో ప్రేమ వ్యవహారం నడుస్తుండేది. అయితే ఆ యువతి అట్లూరు మండలంలోని రైతు భరోసా కేంద్రంలో ఉద్యోగం చేస్తుండేది. అయితే వీరిద్దరి మధ్య ఏమైందో ఏమో తెలియదుకానీ గురువారం ఉదయం రైతు భరోసా కేంద్రం వద్ద ప్రేమించిన యువతిపై పెట్రోలు పోసి తనపై పెట్రోలు పోసుకొని సాయి కుమార్‌రెడ్డి నిప్పంటించుకోవడానికి ప్రయత్నించాడు. అక్కడ ఉన్న సహోద్యోగులు అడ్డుకోవడంతో వెంటనే వెనుతిరిగి బద్వేలు పట్టణానికి వచ్చాడు. వచ్చిన కొద్ది సమయానికి సిద్ధవటం రోడ్డులోని మృతుడు ఉన్న ఇంట్లో నుంచి మంటలు చెలరేగి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. అలాగే ఆ ఇంటికి కొద్ది దూరంలో మృతుడి అక్క మగ్గం వర్క్‌చేస్తూ దుకాణం నిర్వహిస్తుండేది. మృతుడు అక్క సంఘటనా స్థలానికి చేరుకుంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేస్తున్న సమయంలో కాలిపోయిన మృతదేహాన్ని గుర్తించారు. సాయికుమార్‌రెడ్డి ఇంటికి వచ్చిన విషయం మృతుడి అక్కకు తెలియకపోవడంతో ఇంట్లో ఎవరూ లేరనుకున్నారు. కానీ మృతుడు సాయికుమార్‌రెడ్డికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుందా? లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనేది తెలియడం లేదు. కాగా మృతుడు ప్రేమించిన యువతి కొండూరు పోలీస్‌స్టేషన్‌లో సాయికుమార్‌రెడ్డి రైతు భరోసా కేంద్రం వద్ద తనపై పెట్రోలు పోసి దాడి చేసినట్లు ఫిర్యాదు చేసింది. అలాగే మృతుడు తండ్రి బాలిరెడ్డి ఫిర్యాదు మేరకు ప్రేమ వ్యవహారంతోనే తన కుమారుడు సాయికుమార్‌రెడ్డి మృతి చెందాడని బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. మృతికిగల కారణాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది.

హుండీ ఆదాయం రూ.46.33 లక్షలు



బ్రహ్మంగారిమఠం ఆలయ ప్రాంగణంలో హుండీని లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, జూన్ 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం ఆలయ ప్రాంగణంలో గురువారం దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్, ప్రస్తుత ఆలయ ఫిట్‌పర్సన్ సి.శంకరబాలాజీ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు.
వీరబ్రహ్మేంద్రస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యుల అధ్యక్షతన ఆరు హుండీలను మూడు నెలలకు సంబంధించి లెక్కించగా రూ.46,33,057 నగదు, 36 గ్రాములు బంగారు, 640 గ్రాములు వెండి ఉన్నట్లు ఆలయ మేనేజరు ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు జేఈఓ పాండురంగారెడ్డి, పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళ మృతి

గుర్రంకొండ, జూన్ 13:ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో సునీత(30)మహిళ మృతి చెందిన సంఘటన మామిళ్లవారిపల్లె సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ ఎగువకమ్మ పల్లెకు చెందిన ఎ.రాంమోహన్, సునీత దంపతులు గుర్రంకొండలో కాపురముంటూ పెద్దమండ్యం మం డలం తురకపల్లెలో టమోటా నర్సరీని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి వర్షం కురవడంతో ఆటోలో గుర్రంకొండకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ఆటోను మామిళ్లవారిపల్లె సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద మార్కెట్ యార్డు నుంచి పెద్దమండ్యం వైపు వెళ్లుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సునీత తలకు ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో తీవ్ర రక్త గాయమైంది. వెంటనే ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెం దినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం వాల్మీకీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మృతురాలికి ఇద్దరు చిన్నపి ల్లలున్నారు. దీంతో గ్రామంలో విషాదచాయాలు అలుముకు న్నాయి.

భక్తుల కల్పవల్లి నాగారపమ్మ

- రేపటి నుంచి తిరుణాల ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



నాగారపమ్మ ఆలయం, ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె, జూన్ 13: భక్తుల కోర్కెలు తీర్చే నాగారపమ్మ తల్లి ఆడవాళ్లకు బిడ్డలను ప్రసాదించే శక్తి గల అమ్మగా పేరుంది. దశాబ్దాల కాలం నాటి చరిత్ర కలిగిన నాగారపమ్మ మండల పరిధిలోని పెద్దినేని కాలువ పంచాయతీ బండకాడ ఈడిగపల్లె గ్రామంలో బాహుదానది పరివాహ ప్రాంత సమీపంలో వెలిసి.. భక్తుల పాలిట కొంగు బంగారమై పూజలందుకుంటోంది. ఈ ఏడాది మూడు రోజుల పాటు తిరుణాళ్ల మహోత్సవం నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ శనివారం ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, హోమాలు నిర్వహిస్తారు. 16న ఆదివారం ఉదయం పుట్టను అలంకరించి పుట్ట నుంచి పుట్టమన్ను బంగారం తెచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. 17న సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, రాత్రికి గావు పట్టే కార్యక్రమంతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో మొక్కుబడులు ఉన్న వారు చాందినీబండ్లు కట్టి మొక్కులు తీర్చుకుంటారు. ఈ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

నాగారపమ్మ తల్లి చరిత్ర

రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి సమీపంలోని నాగారం నుంచి కొందరు దొంగలు నాగారపమ్మ శిల్పాన్ని అపహరించి తీసుకెళ్తుండగా పింఛా నది ఒడ్డుకు రాగానే చీకటి పడటంతో రాత్రి అక్కడే ఆగారు. ఉదయం నది దాటుతుండగా నాగారపమ్మ విగ్రహం నదిలో పడిపోవడంతో ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో దొంగలు అక్కడి నుండి వెళ్లిపోయారని.. పెద్దినేనికాలువ పంచాయతీలోని బండకాడ ఈడిగపల్లెకు చెందిన కొందరు రజకులు బట్టలు ఉతికేందుకు నదిలోకి వెళ్లినప్పుడు వారికి నాగారపమ్మ విగ్రహం దొరికిందని స్థానికులు చెప్పుకుంటున్నారు. వారు దానిని తీసుకువచ్చి బండకాడ ఈడిగపల్లెకు దక్షిణ భాగాన ప్రతిష్ఠించి చిన్న గుడిగా నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ప్రతి గురు, ఆదివారాల్లో అక్కడ ప్రత్యేక పూజలు జరుగుతుండటం ఆనవాయితీగా మారిపోయింది. ప్రతియేటా ఏరువాక పౌర్ణమికి నాగారపమ్మ తిరుణాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

తిరునాళ్లకు భారీ ఎత్తున ఏర్పాట్లు

నాగారపమ్మ తల్లి తిరుణాళ్ల మహోత్సవాలకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుణాళ్లలో భాగంగా మండల కేంద్రంలోని పురవీధుల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు అన్నమయ్య, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కావడం విశేషం. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చాందినీ బండ్లు కట్టే భక్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ ఎస్‌కేయం హుస్సేన్ తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రశాంత వాతావరణంలో తిరుణాల నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే చాందినీబండ్లు కట్టేవారు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని విద్యుత్‌శాఖ ఏఈ రమేశ్ తెలిపారు. సమాచారం ఇస్తే ప్రమాదాలు జరగకుండా లైన్‌మ్యాన్ అందుబాటులో ఉంటారన్నారు. ఎక్కువ ఎత్తు లేకుండా చాందినీబండ్లు కట్టుకోవాలని సూచించారు.

మంచి ఫలితాలు సాధించాలి: ఎంఈఓ


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

లక్కిరెడ్డిపల్లె,జూన్ 13: ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈఓ-2 వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో ప్రతి ఏటా మంచి ఫలితాలు సాధిస్తున్నారని, 4 సంవత్సరాల నుంచి ట్రిపుల్‌ఐటీకి 10 మంది, ఎన్‌ఎంఎన్‌కు 12 మంది విద్యార్థులు ఎంపికావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, అధ్యాపకులు నిత్యపూజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు రేపు రాత పరీక్ష

లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలిన 7, 8, 9 తరగతుల సీట్లకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 15న ఉదయం 9 గంటలకు ఏపీ మోడల్ స్కూల్‌లో రాత పరీక్ష నిర్వహిస్తున్నామని, అనంతరం మెరిట్ ప్రకారం ప్రవేశం ఉంటుందన్నారు. అలాగే మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఏప్రిల్‌లో రాత పరీక్ష నిర్వహించామని, ఎంపికైన వారికి ఫోన్ చేశామని, విద్యార్థులు ఈ నెల 20వ తేదిలోపు ఒరిజనల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు. గడువులోపు రాకపోతే ఇతర విద్యార్థికి అవకాశం కల్పిస్తామన్నారు.

పీహెచ్‌సీలో నాణ్యత ప్రమాణాల తనిఖీ

రాయచోటిటౌన్, జూన్ 13: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న జాతీయ వైద్య సేవల నాణ్యత ప్రమాణాలపై జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ తనిఖీ చేశారు. గురువారం ఆయన రాయచోటి మండల పరిధిలోని యండపల్లి పీహెచ్‌సీ పరిధిలోని శిబ్యాల గ్రామంలో గల ఆరోగ్య ఉపకేంద్రంలో జాతీయ వైద్య సేవల నాణ్యత ప్రమాణాల ప్రతినిధులు డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ రాజాలతో కలిసి చెక్‌లిస్ట్ ప్రకారం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ మాట్లాడారు. కార్యక్రమంలో యండపల్లి పీహెచ్‌సీ వైద్యులు జ్యోతి, జిల్లా జాతీయ వైద్య సేవల నాణ్యత ప్రమాణాల ప్రతినిధి నాగరాణి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 13: అన్నమయ్య జిల్లాలో రైతుల సమస్యలు పరిష్కరించాలని గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌వోకు సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. వరి, బొప్పాయి, అరటి, టమోటా, మామిడి తదితర పంటలు వేసిన రైతులకు హెక్టార్‌కు రూ.లక్ష ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేగాకుండా రైతులకు పంటల నష్టపరిహారంతో పాటు ఇన్సూరెన్స్ కూడా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏ. రామాంజులు, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలి

చిట్వేలి, జూన్ 13: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీపీ చంద్ర కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీపీ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధిని శాఖలవారిగా అధికారులు సభకు వివరించారు. సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ మండలంలో అనాథ పిల్లలను గుర్తిస్తే వారికి ప్రభుత్వం తరపున వసతి, విద్యను అందిస్తామన్నారు. ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం ద్వారా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సీనియర్ నాయకులు ఎల్‌వీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ ఎ.వెంకటరంగారావు పాల్గొన్నారు.

మదనపల్లె పురపాలక సంఘము

బహిరంగ వేలము ప్రకటన

ఆర్.ఓ.సి.నెం:1146/ఎ1/2011 తేది:12-06-2024

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలోని దిగువ మరియు మొదటి అంతస్తు నందుగల షాపు రూములను 3 సం॥ల కాలము బాడుగకు ఇచ్చుటకు గాను మరియు దినసరి మాంసము మార్కెటు & ప్రైవేట్ బస్టాండ్‌లను 2024-25 ఆర్థిక సంవత్సరమునకు లీజు ఇచ్చుటకు గాను ది: 22-06-2024 వ తేదీ ఉదయం గం॥ 11:00 లకు కమీషనరు గారిచే కాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ. సం.	పాట వివరములు	సాల్వెన్సీ సర్టిఫికెట్	పాట కాలమందు చెల్లించవలసిన డిపాజిట్ రూ. (డి.డి.లు మాత్రమే)	రిజిస్ట్రేషన్ చార్జీలు నిమిత్తం చెల్లించవలసిన డిపాజిట్ రూ.
1	గ్రౌండ్ ఫ్లోర్ నందు వున్న షాపు రూములు	రూ.1,00,000/-	రూ.1,00,000/-	రూ.15,000/-
2	మొదటి అంతస్తు నందు వున్న షాపు రూములు	రూ.50,000/-	రూ.25,000/-	రూ.10,000/-
3	దినసరిమాంసం మార్కెటు	రూ.2,00,000/-	రూ. 50,000/-	రూ.15,000/-
4	ప్రైవేట్ బస్టాండు	రూ.1,00,000/-	రూ.30,000/-	రూ. 15,000/-

షరతులు: ❖ ముందుగా షాపు చూసుకొని పాటలో పాల్గొనవలెను ❖ పాట ఖాయము చేయుటకు, తిరస్కరించుటకు కౌన్సిలు వారికి పూర్తి అధికారము కలదు. ❖ షాపు రూము పొందిన పాటదారుడు ప్రతి నెల బాడుగ ఆ నెల 5వ తేదిలోగా చెల్లించవలెను. ❖ నెలసరి బాడుగ పై ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారము 18% GST చెల్లించవలెను. ❖ నిర్ణీత సమయం దాటిన బకాయి అద్దెలుపై నూటికి నెల కి రూ॥ 2.5/- అపరాధ రుసుముతో చెల్లించవలెను. ❖ పాటకు కౌన్సిలు వారి ఆమోదమునకు లోబడి ఖాయము చేయబడును. ❖ బాడుగ 3 నెలలు దాటి చెల్లించనిచో ఏవిధమైన నోటీసు జారీ చేయకనే తదుపరి లీజు కాలం రద్దు చేయబడును. ❖ షాపు నందు గల కరెంటు బిల్లులు ఎ.పి.ట్రాన్స్ కో వారి నోటీసులు ప్రకారం లీజుదారుడే చెల్లించవలెయును. ❖ పాట ఆమోదము ఉత్తర్వులు పొందిన 3 దినములలోగా సబ్ రిజిస్ట్రార్ వారి ఉత్తర్వులు ప్రకారము అగ్రిమెంటు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించి దాఖలు చేయవలెను. ❖ పురపాలక సంఘమునకు ఏవిధమైన పన్నులు బకాయి ఉన్నయెడల వారు వేలము నందు పాల్గొనుటకు అనర్హులు. ❖ పాట ఖాయపరచిన 7 దినములలోగా 6 నెలలు నెలసరి బాడుగ ధరావత్తుగా చెల్లించవలెను. పాట ఖాయపరచిన పాటదారులు నిర్ణీత సమయం లోగా 6 నెలలు బాడుగ ధరావత్తులు చెల్లించని పాట దారులు పాట రద్దుపరచి తిరిగి పాట పెట్టుట వలన వచ్చిన నష్టమును పాటదారుల నుండి రాబట్టుటయేకాక పాట సమయంలో చెల్లించిన ధరావత్తులు మున్సిపల్ నిధులకు జమచేయబడును. ❖ ఎస్.సి. మరియు ఎస్.టి. రిజర్వు కాబడిన మున్సిపల్ షాపు రూములుపై పాల్గొను వారు వారి కులధృవీకరణ పత్రము ఆధార్ కార్డు మరియు సాల్వెన్సీ సర్టిఫికేట్ దాఖలు చేయవలెను. ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టం 1965 రాబడులు మరియు వ్యయము రూలు (4)సి ప్రకారం నిర్ణయించబడునని తెలియజేయడమైనది. ఇతర వివరములకు కార్యాలయ పని వేళలయందు రెవెన్యూ అధికారి వారిని కాని లేక రెవెన్యూ ఇన్స్పెక్టర్ వారిని కాని లేక A1 వారిని కాని సంప్రదించవచ్చును.

సం/- **కమిషనర్,** మదనపల్లె పురపాలక సంఘము

బీసీజీ టీకా సురక్షితం

● సంబేపల్లె వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి


టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

సంబేపల్లె, జూన్ 13: క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ టీబీ ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని సంబేపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ వయోజనుల బీసీజీ టీకా సురక్షితమని, ఎటువంటి అపోహలు లేవని, ప్రతిఒక్కరూ తప్పకుండా టీకా వేయించుకుని క్షయవ్యాధి నుంచి విముక్తి పొందాలని ఆయన పేర్కొన్నారు. క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా వయోజనులకు బీసీజీ టీకా కార్యక్రమం ప్రతి గురువారం అన్ని సబ్ సెంటర్లలోనూ, విలేజ్ క్లీనిక్‌లో వేస్తారని ఆయన తెలిపారు. ఈ టీకాపైన ఎటువంటి అపోహలు, అనుమానాలు అవసరం లేదన్నారు.

ఈ లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా వేయించుకోవాలి

కింది లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరూ బీసీజీ టీకాలు వేయించుకోవాలని టీబీ యూనిట్ సూపర్‌వైజర్ నాగేశ్వర తెలిపారు. గడిచిన 5 ఏళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయిన వాళ్లు తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. అదే విధంగా 18 ఏళ్లు నిండిన వారు, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, శరీర ద్రవ్యరాశి సూచిక 18 కన్నా తక్కువ ఉన్న వారు, టీబీ రోగులతో సన్నిహితంగా ఉండేవారు ఈ బీసీజీ టీకాలను తప్పకుండా వేయించుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యాక్సిన్ ఇచ్చే ముందు లబ్ధిదారులకు సమ్మతి పత్రం చదివి వినిపించి వారి సంతకం తీసుకోవాలన్నారు. వ్యాక్సిన్ వేసిన తర్వాత లబ్ధిదారులకు వ్యాక్సిన్ వేసిన చోట బొబ్బ గానీ, మచ్చగానీ ఏర్పడినా.. భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు.

ఈ ప్రమాణాలు పాటించే వారికి టీకా వద్దు

టీబీ వ్యాధి ఉండి టీబీ ముందులు వాడుతున్న వాళ్లు ఈ బీసీజీ టీకాను వేయించుకోరాదని వైద్యాధికారి తెలిపారు. అంతేగాకుండా గర్భవతులు, పాలు ఇచ్చే తల్లులు, హెచ్‌ఐవీ రోగులు, ఎయిడ్స్ రోగులు ఈ టీకాను తీసుకోవద్దని తెలిపారు. వ్యాక్సిన్ వేసినప్పుడు రియాక్షన్స్ వచ్చిన వాళ్లు, కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకుని మందులు వాడుతున్న వాళ్లు ఈ టీకాకు దూరంగా ఉండాలన్నారు. అంతేగాకుండా 18 సంవత్సరాలు నిండని వారు, రక్తదానం చేసిన మూడు నెలల వరకు ఈ టీకా జోలికి వెళ్లరాదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి అనగా

క్షయ మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే అంటు వ్యాధి. ఈ వ్యాధి స్త్రీ, పురుషులకు వయస్సులతో సంబంధం లేకుండా వస్తుంది. ఈ వ్యాధి శరీరంలోని ఏ అవయవానికి అయినా రావచ్చు. ముఖ్యంగా ఈ వ్యాధి ఊపిరితిత్తులకు ఎక్కువగా సోకుతుంది. క్షయ వ్యాధి రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్షయ క్రిములు గాలిలో తుంపర్లుగా వెళ్తాయి. ఈ తుంపర్లను ఆరోగ్యవంతుడు పీల్చినప్పుడు ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణకు పుట్టిన పసిబిడ్డలకు బీసీజీ టీకాలు ఇప్పించాలి. క్షయ రోగి ఎక్కడ పడితే అక్కడ ఉమ్మివేయరాదు. క్షయ రోగులు మందులు క్రమం తప్పకుండా వాడాలి. వ్యాధి లక్షణాలు తగ్గినప్పటికీ మందులు ఆపకూడదు.

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

- మధుసూదన్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి



క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలి, దీనికి చిన్న, పెద్ద, స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరికీ సోకుతుంది. క్షయ వ్యాధి వలన ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారు. ఇతర వ్యాధుల మాదిరిగా సీజనల్ వ్యాధి కాదు. ఈ వ్యాధి అంత ర్జాతీయ విపత్తుగా మారింది. క్షయవ్యాధి అదుపు చేసేందుకు ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

వైభవంగా గంగమ్మతల్లి జాతర


పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

రైల్వేకోడూరు, జూన్ 13: పంచాయతీలోని కొత్తకోడూరులో గంగమ్మతల్లి జాతర గురువారం వైభవంగా జరిగింది. బుధవారం అర్ధరాత్రి గంగమ్మతల్లి ప్రతిమను తయారు చేశారు. అనంతరం పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ముందస్తు చర్యగా పోలీసులు ఎలాంటి గొడవలు జరకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు జాతర నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. శుక్రవారం గంగమ్మతల్లిని నిమజ్జనం చేస్తారు. కాగా అమ్మవారు పార్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బీసీజీ టీకాతో ప్రయోజనం

రైల్వేకోడూరు, జూన్ 13: బీసీజీ టీకాతో ప్రయోజనాలు ఉన్నాయని వైద్య, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ బాలక్రిష్ణంరాజు తెలిపారు. గురువారం మండలంలోని పలు ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్న బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాబెటిక్ వ్యాధి కలిగి ఉన్న వారు, గతంలో ధూమపానం అలవాటు ఉన్న వారు, గత 3 ఏళ్లలో టీబీ రోగుల కుటుంబ సభ్యులకు టీకా వేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయం-2 ఆరోగ్య కార్యకర్త ఏ.కలూదా, ఎంఎల్‌హెచ్‌పీ కేఎం.పరిమళ, ఆశా కార్యకర్తలు శ్యామల, చంద్రకళ, లక్ష్మీ, కుమారి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన కస్తూరి

రైల్వేకోడూరు, జూన్ 13: రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్‌లను గురువారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడులు కలిశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేయించాలని వివరించారు. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అనంతరం మంత్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు నాయిడోరి రమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

చిట్వేలి, జూన్ 13: మండల కేంద్రమైన చిట్వేలిలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఉప సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి గురువారం తెలియజేశారు. ఈ మేరకు కార్యాలయాల సముదాయం వద్ద తాగునీటి పైపులైన్ లీకేజి అవుతున్న కారణంగా మరమ్మతులు చేయాల్సిన కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు అప్రమత్తమై సరిపడ తాగునీటిని ముందస్తుగా భద్రపరుచుకోవాలని ఉమామహేశ్వర్‌రెడ్డి కోరారు.

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి

● ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, జూన్ 13: నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని గురువారం ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో రాయచోటి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీరెడ్డి మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్యను అభ్యసించడానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాలు జూన్ 4న విడుదలయ్యాయని, అందులో 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు వచ్చి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం, వారిలో ఏడుగురు విద్యార్థులు ఒకే సెంటర్‌లో ఉండడం అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. దీనిపైన ఇప్పటికే దేశవ్యాప్తంగా నీట్ రాసిన విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణను జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ నాయకులు చరణ్, ప్రతాప్, మధుసూదన్, నవీన్, సంతోశ్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

రాయచోటిటౌన్, జూన్ 13: మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కడంతో దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గురువారం కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు గణపతి, రాష్ట్ర సలహాదారులు పరశురాంలు మాట్లాడారు.

కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సుకుమార్, వైద్యులు కోటేశ్వరి, కిరణ్ కుమార్, శివా, మహేశ్‌రాజా, లక్ష్మీప్రసాద్, భాస్కర్‌రెడ్డి, ఎజాజ్, రాజా, అహమూద్, జీనత్, శ్రావణి, హీనావేగం, శైలేశ్, నాగరాజు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన మంగంపేట నాయకులు

ఓబులవారిపల్లె, జూన్ 13: రాష్ట్రంలో కూటమి పార్టీ గెలుపొంది టీడీపీ నూతనంగా అధికారం చేపట్టడంతో మంగంపేట టీడీపీ నాయకులు పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖమంత్రిగా అవకాశం రావడంతో విజయవాడలోని ఆయన ఇంటికి వెళ్లి శాలువా కప్పి సన్మానం చేసి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా మంగంపేట అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కల్లా చలపతి, అనుమల గుండం చంద్రమోహన్, గునిపాటి రాయుడు, టీడీపీ యువ నాయకులు గునిపాటి కిరణ్, వేణుగోపాల్, అనుమలగుండం హరిక్రిష్ణ, పసుపులేటి రమణ, సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

తీవ్రవాదుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసన

రైల్వేకోడూరు, జూన్ 13: ముష్కరులు, తీవ్రవాదులు, పాకిస్థాన్, ఇస్లామిక్‌లు భారతీయ సనాతన హైందవ సంస్కృతి సంప్రదాయాలకు నెలవు అయిన కశ్మీర్ పర్వత శ్రేణుల్లో కొలువైన శ్రీవైష్ణవదేవి అమ్మవారి ఆలయంపై దాడులు చేయడం పికిరిపంద చర్య అని విశ్వహిందూపరిషత్ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక వీరబ్రహేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దరిశా వెంటకరెడ్డి, మనోహర్‌ఆచారి, అదనుకోట నరసింహులు, బీజేపీ జిల్లా నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డిలు మాట్లాడుతూ శ్రీవైష్ణవిదేవి అమ్మవారి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు అక్కడికి వెళుతుంటారని, ఇదే అదునుగా భావించిన ముష్కరులు, తీవ్రవాదులు, పాకిస్తాన్ ఇస్లామిక్ వాదులు కాల్పులు జరపడంతో పది మంది మృతి చెందారన్నారు.

ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలుగంటి దశరథరామయ్య, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర

రాజంపేట, జూన్ 13: రాజంపేట మండలం మదనగోపాలపురంలో గురువారం అంగరంగ వైభవంగా గంగమ్మ జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. పోతులరాజును గ్రామంలో ఊరేగించారు. అమ్మవారికి మహిళలు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి జంతువులు నిర్వహించారు.

తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్ 13: క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని కోనంపేట పీహెచ్‌సీ డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. గురువారం చెరువుముందర వడ్డెపల్లె, కొండవాండ్లపల్లె, కోనంపేట గ్రామాల్లో టీబీ వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ ఉన్నవారు భయపడకుండా ప్రతి పీహెచ్‌సీలో వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని, టీబీ ఉన్న ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ వ్యాక్సిన్ 60 సంవత్సరాలు పైబడిన వారు తప్పకుండా వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షయవ్యాధి సూపర్‌వైజర్ హరి, సీహెచ్‌ఓ రవీంద్ర, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎద్దుల విజయసాగర్

రాజంపేట, జూన్ 13: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో రాజంపేట మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఎద్దుల విజయసాగర్ గురువారం భేటీ అయ్యారు. ఢిల్లీలో ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని, కడప విమానాశ్రయాన్ని కూడా అభివృద్ధి చేసి, మరికొన్ని విమానాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు.


కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎద్దుల విజయసాగర్

పచ్చ తోరణాలతో స్వాగతం



పచ్చ తోరణాలతో పాఠశాల ముఖద్వారం

పెనగలూరు, జూన్ 13: పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా మండలంలోని కొన్ని పాఠశాలల్లో విద్యార్థులను స్వాగతిస్తూ పచ్చ తోరణాలతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా పెనగలూరు ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, నల్లపురెడ్డిపల్లె, చక్రంపేట, నాయుడువారిపల్లె, కట్టావారిపల్లె, కొండూరు, నర్సింగరాజపురం ముఖద్వారాలను పచ్చ తోరణాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉన్న సరస్వతిదేవి విగ్రహాలకు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వంకను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి

రామాపురం, జూన్ 13: మండలంలోని బండపల్లె గ్రామ పరిధిలోని 194, 200 సర్వే నెంబర్లు గల ప్రభుత్వ వంకను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సీపీఐ బృందం గురువారం ఆక్రమణకు గురైన వంక ప్రాంతాన్ని పరిశీలించారు. భూకబ్జాదారులపై రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ వాగులను, భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూమి కోల్పోయిన రైతులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వాసు, కుమార్, ప్రసాద్, సతీశ్‌నాయక్, రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మరిణెమ్మ అమ్మవారికి అభిషేకం

సుండుపల్లె, జూన్ 13: మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ జంగంపల్లిలో వెలసిన మరిణెమ్మ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం ఉదయం 6 గంటలకు అభిషేకం నిర్వహించారు. ప్రతి ఏడాది అమ్మవారి జాతర సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా ఉందని గ్రామస్తులు తెలిపారు. అనంతరం సాయంత్రం మూడు గంటలకు గ్రామ పురవీధుల్లో పోతురాజు ఊరేగింపు చేపట్టారు. అదే విధంగా రాత్రికి ఆసాధుల కథ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. శుక్రవారం అమ్మవారి చల్ల కార్యక్రమం, అన్నదానం నిర్వహిస్తామన్నారు.

వికలాంగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

రైల్వేకోడూరు, జూన్ 13: వికలాంగులకు మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ కోరారు. గురువారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో వికలాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు ఇంటి స్థలాలతో పాటు రెండు ఎకరాల వ్యవసాయ భూమిని ఇవ్వాలని డిమాండు చేశారు. వికలాంగులకు బస్సులు, రైళ్లలో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో వికలాంగులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

వికలాంగుల నూతన కమిటీని గురువారం ఏర్పాటు చేశా రు. కోడూరు మండల వికలాంగుల కమిటీ అధ్యక్షులుగా వెంకటరమణ, కార్యదర్శులుగా ఇంద్రాణి, మీనా, ఉపాధ్యక్షులుగా సుబ్బయ్య, సహాయ కార్యదర్శులుగా శ్రీధర్, 13 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చట్టాలపై వృద్ధులకు అవగాహన


ఆశ్రమంలోని వారికి భోజనం వడ్డిస్తున్న సివిల్ జడ్జి

సిద్దవటం, జూన్ 13: మండలంలోని భాకరాపేట ప్రధాన రహదారి పరమాత్మ సేవా వృద్ధాశ్రమంలో గురువారం మండల లీగల్ సర్వీస్ కమిటీ అధ్యక్షతన వృద్ధులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులకు చట్టాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. వృద్ధుల ఆరోగ్య సమస్యలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు ప్రతిఒక్కరూ చేయూత ఇచ్చి వారిని ఆప్యాయంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, అడ్వకేట్స్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చిట్వేలి, జూన్ 13: మండల పరిధిలోని చిట్వేలి పత్తిగుంటవారిపల్లె 33 కేవీ పరిధిలోని మాలేమార్పురం, గరుగుపల్లె, పోల్లోపల్లె, పత్తిగుంటవారిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చిట్వేలి ట్రాన్స్‌కో ఏఈ వెంకటచలపతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సరఫరాలో అంతరాయాన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాల్సిందిగా ఏఈ వెంకటచలపతి కోరారు.

గంగమ్మతల్లికి 101 కొబ్బరికాయలు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 13: మండిపల్లె రాంప్రసాదురెడ్డికి చంద్రబాబునాయుడి కేబినెట్‌లో మంత్రి పదవి దక్కడంతో అనంతపురం, చౌటపల్లె గ్రామాలకు చెందిన వారు గంగమ్మతల్లి ఆలయ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి 101 టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతేకాకుండా పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అంకన్న విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి విజయవాడలో మంత్రి రాంప్రసాదురెడ్డికి శాలువా కప్పి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి వెంకటేశ్వరులు, వేమయ్య, చలపతి, రాచరాయుడు, గంగయ్య, వేణు, మణికంఠ, భాస్కర్‌లు పాల్గొని అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు.


నేటి నుంచి పొంగళ్లు మహోత్సవం

నందలూరు, జూన్ 13: మండలంలోని నాగిరెడ్డిపల్లెలో వెలసిన మారెమ్మతల్లి ఆలయంలో శుక్రవారం నుంచి అమ్మవారికి పొంగళ్ల మహోత్సవ కార్యక్రమం నిర్వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారు మాట్లాడుతూ 14వ తేది ఆలయంలో మహాగణపతి పూజా కార్యక్రమాలతో ప్రారంభించి ధ్వజారోహణ కార్యక్రమం, మహాగణపతి హోమం, మారెమ్మతల్లి మూలమంత్ర హోమాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం అమ్మవారికి పాలాభిషేకం ఉంటుందని తెలియజేశారు.

తిరుమల వెంకన్న ఆశీస్సులతో అంచెలంచెలుగా ఎదిగా. రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడంతో పాటు దేశ రాజకీయాల్లో కూడా మంచి పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నా.ఏ సంకల్పం తీసుకున్నా ఒక నిమిషం వేంకటేశ్వరస్వామిని తలుచుకుని ముందుకు వెళ్లడం నాకు అలవాటు. చదువుకునే రోజుల్లో కూడా దేవుడికి మొక్కు తీర్చుకునేందుకు మంగాపురం నుంచి కొండకు నడిచివచ్చేవాళ్లం.బ్రహ్మోత్సవాల రోజుల్లో ఉపవాసముండి పూజల తర్వాత మధ్యాహ్నం భోంచేసేవాళ్లం.

శ్రీవారి ఆశీస్సులతోనే ఎదిగా


శ్రీవారిఆలయంలో బాబు ధ్యానముద్ర



శ్రీవారి సేవలో సీఎం

తిరుమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. సంప్రదాయ వస్త్రధారణ, నుదుట తిరునామంతో గురువారం ఉదయం 8గంటలకు కుటుంబసభ్యులతో కలిసి చంద్రబాబు వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. సీఎం హోదాలో మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ ఎప్పటిలానే క్యూలైన్ ద్వారా మహద్వారం వద్దకు చేరుకున్న చంద్రబాబుకు శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితుల బృందం, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి ధ్వజస్తంభాన్ని తాకి గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టును దర్శించుకున్న చంద్రబాబుకు శేషవస్త్రాన్ని సమర్పించారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించారు.జేఈవో తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించిన సీఎం 8.55 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు.

జనాల్లో దూసుకుపోయిన సీఎం

సీఎం చంద్రబాబు శ్రీవారి దర్శన అనంతరం ఆలయం వెలుపలకు వచ్చి వాహనం వద్దకు చేరుకోవాలి. సెక్యూరిటీ అధికారులు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది ఆ మేరకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేసి భక్తులను గొల్లమండపం వెనుకభాగంలో కట్టడి చేశారు. అయితే ఆలయం వెలుపలకు వచ్చిన చంద్రబాబు అఖిలాండం వద్దకు వెళ్లాలని చెప్పడంతో గొల్లమండపం పక్కనే ఉన్న దారి గేట్లను తెరిచారు. అక్కడినుంచి చంద్రబాబు భారీ సంఖ్యలో ఉన్న జనాల మధ్యలోనే ముందుకు వెళ్లారు. ఎస్ఎస్‌జీ సెక్యూరిటీ కాన్వాయ్ వద్దనే ఉండిపోవడంతో సాధారణ సెక్యూరిటీ సిబ్బందితో సహాయంతో అఖిలాండం వద్దకు చేరుకున్నారు. పక్కనే ఉన్న పెద్దజీయర్ మఠానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. తర్వాత అఖిలాండం వద్ద కొబ్బరికాయలు సమర్పించారు. సీఎం జనాల మధ్యలో వెలుతున్న సమయంలో పోలీసు ఉన్నతాధికారుల్లో టెన్షన్ కనిపించింది.


శ్రీవారి ఆలయంలోకి క్యూలైన్లో వెళుతున్న చంద్రబాబు

టీటీడీ నుంచే ప్రక్షాళన మొదలు

ఈ ఐదేళ్లలో తిరుమలలో ప్రసాదాలు మొదలుకుని పరిశుభ్రత వరకూ తిలోదకాలు ఇచ్చేశారు.పెద్దఎత్తున అవకతవకలు జరిగాయి.గంజాయి, అన్యమత ప్రచారం, లిక్కర్, నాన్‌వెజ్, ఇష్టానుసారం పైరవీలు చేసేందుకు కేంద్రంగా తిరుమలను మార్చేశారు.కక్షసాధింపు చర్యలు వుండకూడదు కానీ చెడ్డ వ్యక్తులను శిక్షించి మంచి వాళ్లను కాపాడుకోకపోతే దేవుడు కూడా సహకరించడు. తిరుమల పవిత్రమైన దివ్యక్షేత్రం.ఇక్కడ ఏడుకొండల వాడా వెంకట రమణా, ఓం నమో వేంకటేశాయా అనే భక్తుల నినాదాలు తప్ప మరొకటి వినిపించకుండా చూస్తాం.దేశమే కాదు... ప్రపంచం మొత్తం అభినందించేలా టీటీడీని తీర్చిదిద్దుతాం.

దటీజ్ చంద్రబాబు



రేణిగుంట, జూన్ 13: తిరుమల పర్యటన ముగించుకున్న చంద్రబాబు విజయవాడ వెళ్లేందుకు రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకున్నారు.అక్కడ వేచి వున్న సామాన్య ప్రజలను గుర్తించి వాహనం దిగి గ్యాలరీల వద్దకు వెళ్లి వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అక్కడే ఆ సమస్యలను చదివి పక్కనే ఉన్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.గతంలో ముఖ్యమంత్రిగా వున్న జగన్ విమానాశ్రయానికి ఎప్పుడు వచ్చినా లోపలకు ప్రత్యేక కాన్వాయ్‌లో వెళ్లిపోయేవారు.సమస్యలను విన్నవించేం దుకు ఆశతో వచ్చిన ప్రజలకు నిరాశ మిగిల్చేవారు.


శ్రీవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో, ఎమ్మెల్యేలు, టీడీపీ ప్రముఖులతో

ముందుండి నడిపించండి

రాజకీయ ముసుగులో నేరాలు చేయాలంటే ఇక కుదరదు.ఎర్రచందనం స్మగ్లరుకు ఏకంగా ఎమ్మెల్యే సీటు ఇచ్చే ధైర్యం చేశారంటే వ్యవస్థను ఎంత పాడు చేశారో తెలుస్తోంది. చాలా ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది. శ్రీవారి సాక్షిగా చెబుతున్నా.మంచిని ప్రోత్సహిస్తా. చెడును తుంగలో తొక్కేస్తా.మేమొస్తే న్యాయం జరుగుతుందని ప్రతి ఒక్కరూ నమ్మకం పెట్టుకున్నారు.ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. గడిచిన ఐదేళ్లలో జరిగిన నష్టంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. తిరిగి పునర్నిర్మించు కోవాల్సిన అవసరముంది. ఆ శక్తిని దేవుడు టీడీపీకి ఇచ్చాడు. ప్రజలు కూడా ఓట్లు వేశాం పనైపోయింది అనుకోకుండా ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నా.

తప్పు చేసిన వారిని శిక్షించకపోతే వ్యవస్థపై ప్రభావం

● ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు


రఘురామకృష్ణరాజుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

రేణిగుంట, జూన్ 13: తప్పు చేసిన వారిని శిక్షించకపోతే వ్యవస్థపై ఆ ప్రభావం చూపుతుందని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు అభిప్రాయపడ్డారు. గురువారం రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో తనపై జరిగిన దాడిపై మెడికల్ రిపోర్ట్‌తో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాలన మారిన తరువాత పోలీసులు తీరు కూడా మారాలన్నారు. ఏ పదవిచ్చినా బాధ్యతగా వ్యవహరిస్తానన్నారు. అనంతరం తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు


ధ్వంసమైన అరటిపంటను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కల్లూరు, జూన్ 13: పులిచెర్ల మండలంలో వ్యవసాయ పంటలపై ఏనుగుల దాడులు 10 రోజులుగా కొనసాగుతున్నాయి. బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి సమీపంలో బుధవారం రాత్రి వ్యవసాయ పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. దీంతో అరటి, మామిడి, పశుగ్రాసం పంటలకు అపార నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన కోదండయ్య వ్యవసాయ పొలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు అరటిచెట్లను విరిచేశాయి. పశుగ్రాసాన్ని తొక్కేశాయి. డ్రిప్ పైపులు, గేట్‌వాల్వ్‌ను విరిచేశాయి. అనంతరం లవకుమార్, నాగరాజు, రామకృష్ణకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. మామిడికాయలను నేలరాల్చాయి. ఏనుగుల దాడిలో సుమారు 2 టన్నుల మామిడికాయలు నేలరాలినట్లు బాధిత రైతులు వాపోయారు. ఏనుగు దాడిలో నష్టపోయిన పంటలను రైతులతో కలిసి ఎఫ్‌బీవో శ్రీదేవి పరిశీలించారు. పంట నష్టంపై ఉన్నతాధికారులకు వివరాలు పంపుతామని తెలిపారు.

గుత్తార్లపల్లెలో అక్రమ గ్రానైట్‌కు అడ్డుకట్ట వేయరా?



గుడుపల్లె, జూన్ 13: గుడుపల్లె మండలం గుండ్లసాగరం పంచాయతీ గుత్తార్లపల్లెలో అక్రమ గ్రానైట్‌ను అడ్డుకట్టు వేయాలని ప్రజలు కోరుతున్నారు. నక్కనపల్లె రెవెన్యూలో సర్వే నెం. 62లో 15.20 ఎకరాల్లోని గుట్ట పోరంబోకు భూమి ఉంది. ఈ గుట్టలో తెల్ల రంగు గ్రానైట్ నిక్షేపాలున్నాయి. ఈ రాతి సంపదపై కుప్పానికి చెందిన ఓ వైసీపీ నేత కన్నుపడింది. కొన్ని నెలలుగా విలువైన గ్రానైట్ నిక్షేపాలను యంత్రాల సాయంతో తీస్తూ తమిళనాడు, కర్ణాటకకు రాత్రి వేళల్లో తరలిస్తునారు. రాతి సంపదను తీసేందుకు మందుగుండుతో పేలుళ్లు జరుపుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పేలుళ్ల వల్ల రాతి ముక్కలు రోడ్డుపై ప్రయాణించే వాహనదారులపై, ఆ సమీప పంట పొలాలపై పడుతున్నట్లు పలువురు వాపోయారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయిందనానరు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రానైట్ అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో చంద్రబాబు

తిరుచానూరు, జూన్ 13: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక తొలిసారిగా తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం కుటుంబ సమేతంగా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. ఆలయం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దంపతులకు జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మొదట వీరు ధ్వజస్తంభానికి నమస్కరించాక గర్భాలయంలో మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వేదపండితులు ఆశీర్వచన మండపంలో వేదాశీర్వచనం చేసి.. అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో సుమారు 20 నిమిషాలు గడిపారు. అనంతరం చంద్రబాబు ఆలయం వెలుపలకు బయటకు రాగానే భక్తులు, స్థానికులు సీఎం.. సీఎం అంటూ నినాదాలు నినాదాలు చేయడంతో వారిని వారించి ఆలయం వద్ద గోవిందనామ స్మరణ చేయాలని.. అభివాదం చేసి బయల్దేరి వెళ్లారు. అంతకుముందు ఆలయం వద్ద సీఎం చంద్రబాబుకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు స్వాగతం పలికారు. చంద్రబాబుతోపాటు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి ఉన్నారు. గతంలో వీవీఐపీలు దర్శనానికి వస్తే ఆలయం వద్ద దుకాణాలు మూసి పరదాటు కట్టి భక్తులకు ఇబ్బంది కల్గించేవారు. చంద్రబాబు రాక సందర్భంగా ఎలాంటి హడావుడి లేకుండా యథావిధిగా స్థానికులు, భక్తులు ఆలయ పరిసరాల్లో కలియదిరిగారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న పులివర్తి నాని దంపతులు

ఆగస్టు నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

జూలై 11 నుంచి ఇంటింటి సర్వే ● డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, జూన్ 13: క్యాన్సర్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇందులో భాగంగా ఆగస్టు నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో ప్రభావతి తెలిపారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో క్యాన్సర్ స్క్రీనింగ్‌పై వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ బారినపడి ఏటా అనేక మంది మహిళలు మృత్యువాతపడుతున్నారని తెలిపారు. ముందుగానే గుర్తిస్తే నయం చేయవచ్చునని, ఇందుకోసం డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. జూలై 10వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి, క్యాన్సర్ బాధితులకు ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. రాష్ట్ర మానిటరింగ్ అధికారి డాక్టర్ సునీల్‌నాయక్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలిచ్చారు. ఎన్‌సీడీ కోఆర్డినేటర్ శిరీష, డీపీవో హర్షవర్ధన్, గైనకాలజిస్టులు మీనా సయ్యద్, మాధవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

మళ్లీ గరుడవారధిగా మారుతుందా?

వైసీపీ పనిగట్టుకుని మార్చిన పేరుపై ప్రజల్లో అసంతృప్తి



గరుడవారధి అనే పేరు మళ్లీ వస్తుందా, రాదా అనే చర్చ తిరుపతి నగరంలో వినిపిస్తోంది. తెలుగుదేశం ప్రభుత్వంలో రూపుదిద్దుకుని మొదలైన నిర్మాణ పనులు వైసీపీ అధికారంలోకి రాగానే ఆగిపోయిన సంగతి తెలిసిందే. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో తిరిగి పనులు మొదలు పెట్టారు. 24 నెలల్లో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రావలసిన వారధి నిర్మాణానికి సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ముక్కీ మూలిగీ నాలుగున్నరేళ్లకు గాని పూర్తి కాలేదు. చంద్రబాబు విజన్‌గా ప్రజల్లో గుర్తింపు పొందిన గరుడవారధి అనే పేరును వైసీపీ నేతలు మార్చేశారు. టీడీపీ గురుతులేవీ కనిపించరాదు, వినిపించరాదు అనే కారణంతో 'శ్రీనివాస సేతు'గా నామకరణం చేశారు. అయితే వారధి మీద వరుసగా ఉన్న దీపపు స్తంభాల మీద ఉన్న గరుడిడి లోహపు బొమ్మలు చూస్తున్న జనం మాత్రం దీనిని గరుడ వారధిగానే గుర్తిస్తున్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి టీడీపీ రావడంతో జనంలో ఉన్న గరుడవారధి అనే పేరునే తిరిగి కొనసాగిస్తారనే ప్రచారం జరుగుతోంది. - తిరుపతి ఆంధ్రజ్యోతి

రేపు జాబ్ మేళా

చిత్తూరు రూరల్, జూన్ 13: చిత్తూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ చిత్తూరు బ్రాంచ్‌లో సేల్స్ ఆఫీసర్, యూనిట్ మేనేజర్, ఫైనాన్స్ అడ్వైజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పార్ట్‌టైమ్, ఫుల్ టైం పనిచేసేందుకు వీలు ఉంటుందని, 18 నుంచి 40 సంవత్సరాల లోపు వారు, ఏదైనా ఇంటర్, డిగ్రీ కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13: ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలను తిరుపతి క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దాదాపు 25 లక్షలు విలువ చేసే 400 గ్రాముల బంగారు నగలు, 2.25 కిలోల వెండి ఆభరణాలు, టీవీలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి క్రైం డీఎస్పీ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో దోపిడీలకు పాల్పడుతూ లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రజల సొత్తును అపహరిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, నారాయణవనం, వెంకటగిరి, చిత్తూరు పోలీసు స్టేషన్ల పరిధిలో 11 ఇంటి దొంగతనాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. ఎస్పీ ఆదేశాలతో రెండ్రోజులుగా నిందితుల కోసం క్రైం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. క్రైం డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు కళా వెంకటరమణ, రామకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు రవి, గోపీకృష్ణ, బసవరాజు రమేష్, శ్రీనివాస్, వినాయకం వేర్వేరు బృందాలుగా విడిపోయి గాలించారు. వేదిక్ యూనివర్సిటీ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని విచారించగా నేరాలు బయటపడ్డాయి. దాంతో వీరిని తమిళనాడు రాష్ట్రం నీలగిరి జిల్లా గూడళ్లూరు గ్రామానికి చెందిన మగేష్ మణికంఠ, పశ్చిమ గోదావరి జిల్లా తంగేలా మూడి గ్రామానికి చెందిన షేక్ ఆలీ మొహిద్దీన్‌లుగా గుర్తించి, అరెస్టు చేశారు. మగేష్ మణికంటపై తిరుపతి, నారాయణవనం, రేణిగుంట, వెంకటగిరి ప్రాంతాల్లో 50 కేసులున్నాయి. షేక్ ఆలీ మొహిద్దీన్‌పై 40 కేసులుండగా, నిడదవోలు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉందని డీఎస్పీ తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

రెండు బైక్‌లు, 1.5 కిలోల సరుకు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 13: తిరుపతిలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా గిరిదర్శిని లేఅవుట్‌లో ఉంటున్న భరత్, యలహంకకు చెందిన కార్తీక్ అంజన్ కుమార్ కొంతకాలంగా తిరుపతిని అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నారు. వీరు బెంగళూరు నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని, ఇక్కడ విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అందిన సమాచారంతో తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె సర్కిల్ వద్ద సీఐ వినోద్‌కుమార్, ఎస్ఐ షేక్షావల్లి, సిబ్బంది కలసి తనిఖీలు చేపట్టారు. ఇద్దరు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని విచారించారు. వారివద్ద చిన్న, చిన్న ప్యాకెట్లు కలిగిన గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వీరితో పాటు చిన్నపిల్ల వాడు ఉన్నాడు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి.. తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వద్ద హాజరుపరచగా నిందితులకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించాలని ఆదేశించారు.

చంద్రబాబు ఐదు సంతకాలతో లక్షలాది మందికి ఉపశమనం

మదనపల్లె టౌన్, జూన్ 13: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టి చేసిన ఐదు సంతకాలతో రాష్ట్రంలో లక్షలాదిమందికి ఉపశమనం కలిగిందని మండల టీడీపీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.. చంద్రబాబు తొలిసంతకం మెగా డీఎస్సీ నిర్వహణ, రెండో సంతకం ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు, మూడో సంతకం సామాజిక పింఛన్లను పెంచడం, స్కిల్ గణనపైన నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు ఐదో సంతకం చేశారన్నారు. ఐదేళ్లుగా లక్షలాది మంది నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు వస్తాయన్నారు. సామాజిక పింఛన్లను రూ.4వేలకు పెంచారన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదలకు కడుపు నిండుగా బోజనం వడ్డిస్తారన్నారు. ముఖ్యంగా ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దుతో రైతులకు ఉపశమనం కలుగుతుందని దేవరింటి శ్రీనివాసులు తెలిపారు.

మదనపల్లె పురపాలక సంఘము

బహిరంగ వేలము ప్రకటన

ఆర్.ఓ.సి.నెం:1146/ఎ1/2011 తేది:12-06-2024

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులలోని దిగువ మరియు మొదటి అంతస్తు నందుగల షాపు రూములును 3 సం॥ల కాలము బాడుగకు ఇచ్చుటకు గాను మరియు దినసరి మాంసము మార్కెటు & ప్రైవేట్ బస్టాండ్‌లను 2024-25 ఆర్థిక సంవత్సరలనకు లీజు ఇచ్చుటకు గాను ది: 22-06-2024 వ తేది ఉదయం గం॥ 11:00 లకు కమిషనరు గారిచే కాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

వ. సం.	పాట వివరములు	సాల్వెన్సీ సర్టిఫికెట్	పాట కాలమందు చెల్లించవలసిన డిపాజిట్ రూ. (డి.డి.లు మాత్రమే)	రిజిస్ట్రేషన్ చార్జీలు నిమిత్తం చెల్లించవలసిన డిపాజిట్ రూ.
1	గ్రౌండ్ ఫ్లోర్ నందు వున్న షాపు రూములు	రూ.1,00,000/-	రూ.1,00,000/-	రూ.15,000/-
2	మొదటి అంతస్తు నందు వున్న షాపు రూములు	రూ.50,000/-	రూ.25,000/-	రూ.10,000/-
3	దినసరిమాంసం మార్కెటు	రూ.2,00,000/-	రూ. 50,000/-	రూ.15,000/-
4	ప్రైవేట్ బస్టాండు	రూ.1,00,000/-	రూ.30,000/-	రూ. 15,000/-

షరతులు: ❖ ముందుగా షాపు చూసుకొని పాటలో పాల్గొనవలెను ❖ పాట ఖాయము చేయుటకు, తిరస్కరించుటకు కౌన్సిలు వారికి పూర్తి అధికారము కలదు. ❖ షాపు రూము పొందిన పాటదారుడు ప్రతి నెల బాడుగ ఆ నెల 5వ తేదిలోగా చెల్లించవలెను. ❖ నెలసరి బాడుగ పై ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారము 18% GST చెల్లించవలెను. ❖ నిర్ణీత సమయం దాటిన బకాయి అద్దెలుపై నూటికి నెల కి రూ॥ 2.5/- అపరాధ రుసుముతో చెల్లించవలెను. ❖ పాటకు కౌన్సిలు వారి ఆమోదమునకు లోబడి ఖాయము చేయబడును. ❖ బాడుగ 3 నెలలు దాటి చెల్లించనిచో ఏవిధమైన నోటీసు జారీ చేయకనే తదుపరి లీజు కాలం రద్దు చేయబడును. ❖ షాపు నందు గల కరెంటు బిల్లులు ఎ.పి.ట్రాన్స్ కో వారి నోటీసులు ప్రకారం లీజుదారుడే చెల్లించవలెయును. ❖ పాట ఆమోదము ఉత్తర్వులు పొందిన 3 దినములలోగా సబ్ రిజిస్ట్రార్ వారి ఉత్తర్వులు ప్రకారము అగ్రిమెంటు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించి దాఖలు చేయవలెను. ❖ పురపాలక సంఘమునకు ఏవిధమైన పన్నులు బకాయి ఉన్నయెడల వారు వేలము నందు పాల్గొనుటకు అనర్హులు. ❖ పాట ఖాయపరచిన 7 దినములలోగా 6 నెలలు నెలసరి బాడుగ ధరావత్తుగా చెల్లించవలెను. పాట ఖాయపరచిన పాటదారులు నిర్ణీత సమయం లోగా 6 నెలలు బాడుగ ధరావత్తులు చెల్లించని పాట దారులు పాట రద్దుపరచి తిరిగి పాట పెట్టుట వలన వచ్చిన నష్టమును పాటదారుల నుండి రాబట్టుటయేకాక పాట సమయంలో చెల్లించిన ధరావత్తులు మున్సిపల్ నిధులకు జమచేయబడును. ❖ ఎస్.సి. మరియు ఎస్.టి. రిజర్వు కాబడిన మున్సిపల్ షాపు రూములుపై పాల్గొను వారు వారి కులధృవీకరణ పత్రము ఆధార్ కార్డు మరియు సాల్వెన్స్ సర్టిఫికేట్ దాఖలు చేయవలెను. ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టం 1965 రాబడులు మరియు వ్యాయము రూలు (4)కి ప్రకారం నిర్ణయించబడునని తెలియజేయడమైనది. ఇతర వివరములకు కార్యాలయ పని వేళలయందు రెవెన్యూ అధికారి వారిని కాని లేక రెవెన్యూ ఇన్స్పెక్టర్ వారిని కాని లేక A1 వారిని కాని సంప్రదించవచ్చును.

సం/- కమిషనర్, మదనపల్లె పురపాలక సంఘము

మొదటి అంతస్థులో ఈఎన్‌టీ ఓపీ

● మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో వృద్ధులు, దివ్యాంగుల పాట్లు ● గ్రౌండ్ ఫ్లోరుకు మార్చాలంటూ రోగుల వేడుకోలు



మొదటి అంతస్థులోని ఈఎన్‌టీ విభాగానికి మెట్లు ఎక్కలేక వృద్ధురాలి పాట్లు



మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి

మదనపల్లె టౌన్, జూన్ 13: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి అప్ గ్రేడ్‌లో భాగంగా ఈఎన్‌టీ విభాగం(కంటి, ముక్కు, గొంతు) రోగులను పరీక్షించే అవుట్ పేషెంట్ గదిని మొదటి అంతస్థులో ఏర్పాటు చేయ డంతో రోగుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఇటీవల ఆస్పత్రిలో అవుట్‌పే షెంట్ విభాగాలను విభజించి, రోగులను వైద్యులు పరీక్షించేందుకు ప్రత్యేక గదులు కేటాయించారు. ఇందులో భాగంగా ఈఎన్‌టీ విభా గం(కంటి, ముక్కు, గొంతు) రోగులను పరీక్షించే అవుట్ పేషెంట్ గది ని మొదటి అంతస్థులో ఏర్పాటు చేశారు. కాని చాలా మంది వృద్దులు కంటి చూపు సమస్యతో ఆస్పత్రికి వస్తున్నారు. ఓపీలో రోగుల పేరు చెప్పి చీటీలు రాసాక, ఈఎన్‌టీ విభాగం ఎక్కడ అని అడిగితే మొదటి అంతస్థు వైపు చూపుతున్నారు. అసలే వృద్దులు నడవలేని పరిస్థితిలో ఉన్న వారు 20 మెట్లు ఎక్కి మొదటి అంతస్థుకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఆస్పత్రి విభాగపు అధికారులు ఎలాంటి ఆలోచన చేయకుండా ఈఎన్‌టీ విభాగాన్ని మొదటి అంతస్థులో ఏర్పాటు చేయడంపట్ల రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ర్యాంపు కూడా లేకపోవడంతో దివ్యాంగులు మొదటి అంతస్థులోని ఈఎన్‌టీ విభాగానికి వెళ్లలేక, బయట ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించుకునే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి ప్రతి రోజూ 1000 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తారు. వారిలో ఈఎన్‌టీ విభాగానికి 70 నుంచి 100 మంది రోగులు వస్తారు. ఇలా రోజు వందల సంఖ్యలో రోగులు వచ్చే ఆస్పత్రిలో వృద్ధులు, దివ్యాంగులకు కనీస వసతులు కల్పించకపోవడం ఏమిటని పలువురు పెదవి విరుస్తున్నారు. వృద్ధుల సమస్యలను దృష్టిలో ఉంచకుని ఇకనైనా బోధనాస్పత్రి ఉన్నతాధికారులు ఈఎన్‌టీ అవుట్‌పే షెంట్ విభాగాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్చాలని వృద్దులు, దివ్యాంగులు కోరుతున్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళ మృతి




మృతురాలు ఎ.సునీత

గుర్రంకొండ, జూన్ 13:ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో సునీత(30)మహిళ మృతి చెందిన సంఘటన మామిళ్లవారిపల్లె సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ ఎగువకమ్మ పల్లెకు చెందిన ఎ.రాంమోహన్, సునీత దంపతులు గుర్రంకొండలో కాపురముంటూ పెద్దమండ్యం మండలం తురకపల్లెలో టమోటా నర్సరీని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి వర్షం కురవడంతో ఆటోలో గుర్రంకొండకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ఆటోను మామిళ్లవారిపల్లె సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద మార్కెట్ యార్డు నుంచి పెద్దమండ్యం వైపు వెళ్లుతున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సునీత తలకు ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో తీవ్రరక్తగాయమైంది. వెంటనే ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం వాల్మీకీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మృతురాలికి ఇద్దరు చిన్నపిల్లలున్నారు. దీంతో గ్రామంలో విషాధచాయాలు అలుముకున్నాయి.

జెండా కడుతూ గాయపడ్డ టీడీపీ కార్యకర్తకు పరామర్శ

ములకలచెరువు, జూన్ 13: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా మండలంలోని చౌడసముద్రంలో జరిగిన వేడుకల్లో తీవ్రంగా గాయపడ్డ టీడీపీ కార్యకర్త సుహేల్‌ను గురువారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పరామర్శించారు. గ్రామంలో జరిగిన వేడుకల్లో దిమ్మెకు ఉన్న పోలుకు జెండా కడుతూ సుహేల్ ప్రమాదవశాత్తు కింద పడడంతో రెండుకాళ్లకు తీవ్ర గాయాలై మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొంది స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో టీడీపీ నేత త్యాగరాజు యువకుడ్ని పరామర్శించి చికిత్సల నిమిత్తం తన వంతు సాయంగా రూ.3వేలు నగదును అందజేశాడు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరహింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మహీరా, గ్రామ కమిటీ అధ్యక్షుడు బుర్రా రమణ, నాయకులు చాంద్‌బాషా, శేఖర్‌నాయుడు, కృష్ణమూర్తి, రషీద్, సత్తార్, అల్లాబకష్, గౌస్, మున్నా, రెడ్డి మహమ్మద్, నారాయణ, రామచంద్ర, ఎమ్మార్పీఎస్ నేత తిరుపాల్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో పునుగు పిల్లి



నిమ్మనపల్లి, జూన్ 13: మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లిలో గురువారం తన ఇంటి వద్ద అరుదైన పుగుగుపిల్లిని హోంగార్డు శ్రీనివాసులు కనుగొన్నారు. తెల్లవారు జామున వేకువ జామున తన ఇంటి వద్ద కుక్కలు మొరుగుతుండగా వెళ్లి చూడగా అక్కడ పొదల్లో పిల్లి లాంటి జంతువు కనిపించిదన్నారు. వెంటనే కుక్కలను తోలి ఆ పిల్లిని పట్టుకుని గోనెసంచిలో వేశాడు. అయితే ఆ పిల్లి ఆకారం మరోలా ఉండటంతో అటవీ సిబ్బందికి సమాచారం అందించాడు. అటవీ శాఖ సిబ్బంది వచ్చేంత వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దానిని ఉంచారు. అనంతరం అటవీశాఖ గార్డు దీప అక్కడకు చేరుకుని పిల్లిని పరిశీలించి దాని ఫోటోను తీసి ఉన్నతాదికారులకు పంపగా వారు పునుగు పిల్లిగా గుర్తించారు. అనంతరం అటవీ సిబ్బంది తవళం అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీనేల్మేశ్వరస్వామి ఆలయం వద్ద అడవిలో దానిని వదిలి పెట్టారు. కాగా తిరుమల వేంకటేశ్వరస్వామికి అభిషేక సేవకు పునుగు పిల్లి తైలాన్ని ప్రతి శుక్రవారం వాడతారని తెలిసింది. దీని తైలం కారణంగానే శ్రీనివాసుడు నిత్యం ప్రకాశిస్తుంటాడని చెబుతుంటారు.

అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

పీలేరు, జూన్ 13: భక్తుల సౌకర్యార్థం అరుణాచలానికి ఈ నెల 21న పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపనున్నట్లు స్థానిక డిపో మేనేజరు బండ్ల కుమార్, అసిస్టెంట్ మేనేజరు సుబ్బమ్మ తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భంగా రెండు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు రానూ పోనూ టికెట్టు ధర రూ.700లుగా నిర్ణయించినట్లు వివరించారు. ఈ బస్సు మధ్యాహ్నం 2 గంటలకు పీలేరులో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. గిరి ప్రదర్శన పూర్తయిన అనంతరం రాత్రి 12 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఇది కేవలం గిరి ప్రదర్శనకు మాత్రమే పరిమితం చేసినట్లు పేర్కొన్నారు. ఇక రెండవ ఆర్డినరీ సర్వీసు. ఉదయం 5 గంటలకు బయలుదేరి 10 గంటల కల్లా అరుణాచలం చేరుకుంటుందని, దర్శనాలు, గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం తరిగి రాత్రి 10 గంటలకు అక్కడ బయలుదేరుతుందని తెలిపారు. ఆర్డినరీ సర్వీసులో టికెట్టు ధర రూ.650 ఉంటుందన్నారు. టికెట్లు అవసరమైనవారు ఆర్టీసీ ఆన్‌లైన్‌లో 96879 సర్వీసు పేరుతో రిజర్వు చేసుకోవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 99592 25679, 90142 00628, 78931 52748 నంబర్లలో సంప్రదించ వచ్చన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

పీలేరు, జూన్ 13: పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థిని ఎస్‌పి రిషిత ప్రతిష్టాత్మకమైన కేరళ రాష్ట్రం కాసర్గడ్‌లోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో ఎమ్మెస్సీ రసాయన శాస్త్రంలో సీటు సాధించింది. జాతీయ స్థాయిలో జరిగిన ప్రవేశ పరీక్షలో 15వ ర్యాంకు సాధించి అరుదైన ప్రతిభ చాటుకుంది. రిషిత తల్లి బి.కవిత ఇదే డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. సీటు సాధించిన రిషితను ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

క్షయ నివారణకు బీసీజీ టీకాలు

పీలేరు, జూన్ 13: క్షయవ్యాధిని బీసీజీ టీకాతో నివారించవచ్చని జిల్లా వ్యాధినిరోధక టీకా నిర్వహణ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. గురువారం పీలేరు పట్టణం బొడుమల్లువారిపల్లె సచివాలయ పరిధిలోని మణికంఠనగర్‌లో బీసీజీ టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అర్హులైన వారందరికీ టీకాను వేయాలన్నారు. సిబ్బంది కుసుమ, రేణుక, రాజేశ్వరి పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్,: టీబీ విముక్త్ భారత్‌లో భాగంగా చేపట్టిన బీసీజీ వాక్సినేషన్ క్షయ నిర్మూలనకు సురక్షితమని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ పేర్కొన్నారు. గురువారం మదనపల్లె పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, వార్డు సచివాలయాల్లో కొనసాగుతున్న బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

తంబళ్లపల్లెలో: బీసీజీ టీకాతో క్షయ వ్యాధిని నివారించవచ్చని కోసువారిపల్లె వైద్యాధికారి మునికుమార్ అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా 694 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్ర మంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : బీసిజీ టీకాలతోనే టీబి వ్యాదులను నివారించవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్, టీబీ సూపర్ వైజర్ ఎం. రామకృష్ణనాయుడులు వెల్లడించారు. గురువారం వారు మండలంలోని మడుమూరు, ఉయ్యాలవారిపల్లె, కందుకూరు పిహెచ్‌సి పరిధిలోని బీసిజీ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

కలికిరిలో: వయోజనులు క్షయ వ్యాధికి గురికాకుండా ఉండేందుకు బీసీజీ టీకాలను విస్తృతంగా వేస్తున్నట్లు హెల్త్ ఎడ్యుకేటర్ రఫీ, టీబీ వ్యాధి పర్యవేక్షకుడు నాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ బీసీజీ టీకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

మహిళా సంఘాల రికార్డుల ఆడిట్

తంబళ్లపల్లె, జూన్ 13: మండల పరిధిలో గల మహిళా సమాఖ్య సంఘాలకు సంబంధించిన రికార్డుల ఆడిట్‌ను గురువారం నిర్వహించారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో సంఘాల రికార్డులను పరిశీలించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు, వాటి చెల్లింపులు, జమా ఖర్చులు తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

మంత్రి పవన్‌కళ్యాణ్‌ను కలసిన జనసేన నేత



పవన్‌కళ్యాణ్‌ను అభినందిస్తున్న రామాంజనేయులు

మదనపల్లె, జూన్ 13: మదనపల్లె నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, జనసేన అధినేత రాష్ట్ర మంత్రి పవన్‌కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి నేతల ప్రమాణ స్వీ కారానికి వెళ్లిన ఆయన..గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో అధినేతను కలసి శుభాకాంక్షలు తెలిపారు. పీఠాపురంలో ఎమ్మెల్యేగా విజయం సాధించడం, రాష్ట్ర మంత్రిగా పదవి చేపట్టిన శ్రీరామ రామాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. రెట్టింపు ఉత్సాహంతో పార్టీ అభివృద్ధికి, కూటమి ప్రభుత్వంలో పని చేస్తామని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే నిజయోకవర్గాలకు వస్తానని, సమస్యలపై చర్చించి పరిష్కరిద్దామని అధినేత పవన్‌కళ్యాణ్, శ్రీరామ రామాంజనేయులుకు హామీ ఇచ్చారు. అలాగే మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, పార్టీ నాయకుడు దారం హరిప్రసాద్‌లు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేపీ నేతలు



సత్యకుమార్‌ను సన్మానిస్తున్న యల్లంపల్లె ప్రశాంత్

మదనపల్లె అర్బన్, జూన్ 13: రాష్ట్రమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన సత్యకుమార్ యాదవ్‌ను మదనపల్లె బీజేపీ నేతలు గురువారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మదనపల్లెకు చెందిన రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్ మంత్రిని కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే సీటీఎంకు చెందిన బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జీ ఓసూరి కిరణ్‌కుమార్ మంత్రికి దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ స్థితి గతులు తెలిసిన విద్యాపరిషత్ నాయకుడిగా, వెంకయ్యానాయుడుకి వ్యక్తిగత కార్యదర్శిగా, ఉపరాష్ట్రపతికి ప్రత్యేకాధికారిగా సేవలందిచిన సత్యకుమార్ రాయలసీమలో పర్యటించి పెండింగ్‌లోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి, పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలతో రాయలసీమలో కరువును లేకుండా చేయడానికి కృషి చేయాలని కోరారు.

మంత్రి మండిపల్లిని కలిసిన టీడీపీ నేతలు



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నేతలు

మదనపల్లె, జూన్ 13: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డిని మదనపల్లె టీడీపీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని విజయవాడకు వెళ్లిన మల్లికార్జుననాయుడు గురువారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఒకే మండలానికి చెందిన ఇద్దరు నేతలు ఇదివరకే జరిగిన సంఘటనలపై చర్చించారు. కాగా తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్ చినబాబు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయు డు, శ్రీనివాసరాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన తంబళ్లపల్లె నేతలు



మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్

కురబలకోట, జూన్ 13: తంబళ్ళపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు మంత్రులు అచ్చెన్నాయుడు, రాంప్రసాద్‌రెడ్డిలను విజయవాడలో కలిశారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడి ప్రమాణస్వీకారానికి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్ళారు. అనంతరం మంత్రులను కలిసి దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తమ నియో జకవర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రులు నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెట్టు ఉపసర్పంచ్ బొగ్గుభాస్కర్, టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, అంజి, లక్ష్మీనారాయణ, శివయ్య, చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పంపిణీ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రామసముద్రం, జూన్ 13: రామసముద్రం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. ఎంఈవోలు హేమలత, ఆంజనేయులు, హెచ్‌ఎం చిట్టిబాబు, తూర్పు పాఠశాల హెచ్‌ఎం హేమలత విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బెల్ట్‌లతో కూడిన కిట్‌లను మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసం దర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. విద్యా కోసం ఎంత ఖర్చు అయినా ప్రభు త్వం భరిస్తుందన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పీఈటీ చంద్ర, సీఆర్పీలు దామోధర్, హరి, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, అనిత, రామాంజులు, నారాయణస్వామి, పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో-2 నారాయణ

నిమ్మనపల్లిలో: మండలంలోని దాదాపు 58 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది పంపిణీ చేయవలసిన పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి ఎమ్మార్సీ భవనానాని చేరినట్లు ఎంఈవో-2 నారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని అయితే పూర్తి స్థాయిలో అన్ని వస్తువులు రాకపోవడంతో వచ్చిన వాటిని ఆయా పాఠశాలకు అంజేస్తున్నామని రెండు రోజులలో పూర్తి స్థాయిలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తామని ఎవ్వరూ ఆందోళన చెందరాదని తెలిపారు.



వాల్మీకిపురంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో వెంకటరత్నం

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందజేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 14383 పాఠ్యపుస్తకాలు, 22483 నోటు పుస్తకాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వెంకటరత్నం, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట మండల సమావేశం వాయిదా

బి.కొత్తకోట, జూన్13: బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఈ నెల 13న ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నూర్జహాన్ ప్రకటించారు. అయితే గురువారం 11 గంటలు దాటినా తగినంత మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదు. మండలంలో మొత్తం11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా కనీసం 6 మంది అయినా హాజరు కావాల్సి వుంది. వారిలో ఎంపీపీ లక్ష్మీనరసమ్మతో పాటు మరో ఎంపీటీసీ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ఆంధ్ర రాష్ట్రానికి గ్రహణం వీడింది



ఉప్పరవాండ్లపల్లెలో సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు

పెద్దతిప్పసముద్రం జూన్ 13 : రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడిందని కూటమి నేతలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాపూరివాండ్లపల్లెలోని ఉప్పరవాండ్లపల్లె క్రాస్‌లో కూటమి నేతలు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా గురువారం అమరావతి సచివాలయంలో మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పై చేసిన సందర్బంగా నాయకులు బారీగా సంబరాలు చేసుకున్నారు. రాష్ట్రంలో పాలన సుభిక్షంగా ఉంటుందన్నారు. గత ఐదేళ్ల పాలనలో అక్రమకేసులు, వేధింపులు తప్ప అభివృద్ధి లేదన్నారు. కార్యక్రమంలో మావిళ్ల లక్ష్మీనారాయణ, వెంకటరమణరాజు, మాజీ సర్పంచ్ బండి శంకర్‌రెడ్డి,పెద్దపాళ్యెం మురళీకృష్ణ, రాష్ట్ర కాపు కార్యదర్శి బలిజ సేన జనసేన కార్యదర్శి ఎ. దేవేంద్ర, సొరకుండ్లయల్లప్ప, బీజేపీ నాయకులు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.